ప్రజాశక్తి

శుక్రవారం 17 మార్చి 2023 8 పేజీలు

గుంటూరు

పల్నాడు

అరకొర కేటాయింపులు



- కృష్ణా డెల్టాకు రూ.202 కోట్లు
- సిఆర్‌డిఎకు రూ.500 కోట్లు
- ఊసేలేని యూజిడి, వరికపూడిసెల నిర్మాణం, గుంటూరు ఛానల్ విస్తరణ

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

శాసనసభలో ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి గురువారం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రాజధాని అమరావతికి గత బడ్జెట్ మాదిరి కేటాయింపులు అరకొరగానే ఉన్నాయి. అమరావతిలో చేపట్టబోయే అభివృద్ధి కార్యక్రమాలపై బడ్జెట్‌లో ప్రస్తావన లేదు. సిఆర్‌డిఎ ద్వారా రాజధాని రైతులకు అభివృద్ధి చేసిన ప్లాట్ అప్పగింతపై దృష్టి సారించలేదు. సిఆర్‌డిఎకు రూ.500 కోట్లు, భూ సమీకరణ ద్వారా భూములు ఇచ్చిన 25 వేల మంది రైతులకు వార్షిక కౌలు నిమిత్తం రూ.240 కోట్లు, రాజధాని ప్రాంతంలో భూమి లేని నిరుపేదలకు సామాజిక పించన్లు కోసం రూ.88 కోట్లు కేటాయించారు. మంగళగిరి-తాడేపల్లి కార్పొరేషన్‌లో మౌలిక వసతులు, సేవలను మెరుగుపర్చడం ద్వారా రాష్ట్రంలో నమూనా నగరంగా తీర్చిదిద్దుతున్నామని ఆర్థిక మంత్రి తన ప్రసంగంలో పేర్కొన్నారు. అయితే ఈ కార్పొరేషన్‌కు ఎంత నిధులు కేటాయించిదీ స్పష్టత లేదు. అమరావతి-అనంతపురం ఎక్స్‌ప్రెస్ హైవేకు రూ.100 కోట్లు మాత్రమే కేటాయించారు. 2022-23లో ఇదే రీతిలో రూ.100 కోట్లు కేటాయించిన ఇంత వరకు ఖర్చు పెట్టలేదు.

గుంటూరు నగరంలో 2019లో అర్ధాంతరంగా నిలిచిపోయిన యూజిడి పనుల పునరుద్ధరణకు కూడా ప్రాధాన్యం ఇవ్వలేదు. సిఎం జగన్ ఇటీవల గుంటూరులో పర్యటించిన సందర్భంలో యుజిడి పనులు త్వరలో తిరిగి ప్రారంభించేందుకు రూ.230 కోట్లు కేటాయిస్తున్నట్లు ప్రకటించారు. కనీసం సిఎం ఇచ్చిన హామీ మేరకైనా నిధులు కేటాయించలేదు. దీంతోపాటు సిఎం ఇచ్చిన ఇతర హామీలనూ బడ్జెట్‌లో విస్మరించారు. ప్రధానంగా గుంటూరు నగరంలోని శంకర్ విలాస్ బ్రిడ్జి నిర్మాణనికి రూ.132 కోట్లు కేటాయిస్తామని సిఎం ప్రకటించినా కనీస కేటాయింపులు లేవు.

కృష్ణా డెల్టాకు సంబంధించి 2022-23 వార్షిక బడ్జెట్‌లో 599.58 కోట్లు కేటాయించగా ఇందులో ఇప్పటి వరకు రూ.137.82 కోట్లే కేటాయించారు. అయితే 2023-24 ఆర్థిక సంవత్సరానికి కేవలం రూ.202 కోట్లు ఇచ్చారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో కీలకమైన వరికపూడిసెల ప్రాజెక్టు నిర్మాణం, గుంటూరు ఛానల్ విస్తరణ, బుగ్గవాగు తదితర ప్రాజెక్టులకు కేటాయింపులు లేవు. నాగార్జున విశ్వవిద్యాలయానికి రూ.54 కోట్లు, పులిచింతల ప్రాజెక్టు నిర్వహణకు రూ.26 కోట్లు కేటాయించారు. మంగళగిరి ఎయిమ్స్‌కు తాగునీటి సరఫరా నిమిత్తం రూ.కోటి ఆరు లక్షలు ఇచ్చారు. అయితే పల్నాడు ప్రాంతంలో వైఎస్సార్ దుర్భిక్ష నివారణ పథకం, గోదావరి, పెన్నా అనుసంధానం పథకానికి నిధుల కేటాయించలేదు. బడ్జెట్ కేటాయింపులపై జిల్లాకు చెందిన ప్రజా ప్రతినిధులు కూడా ప్రభుత్వ పెద్దలపై వత్తిడి తేలేకపోవడం వల్ల గతేడాది మాదిరిగానే ఈ ఏడాదికూడా కేటాయింపులు చాలా స్వల్పంగా ఉన్నాయనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

అభిప్రాయాలు 8వ పేజీలో

దేశానికి మోదాని ముప్పు పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వి.కృష్ణయ్య, గుంటూరు విజయ్‌కుమార్ తదితరులు

బిజెపి విధానాలపై ప్రచారోద్యమం

- ప్రజావ్యతిరేక విధానాలపై పోరాటాల్లో అన్ని పక్షాలు, సంఘాలు కలిసి రావాలి
- సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు వి.కృష్ణయ్య
- 31 వరకూ పల్నాడు జిల్లాలో ప్రచారం
- 26న పల్నాడు విజ్ఞాన కేంద్రానికి శంకుస్థాపన
- సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయ్‌కుమార్

ప్రజాశక్తి - నరసరావుపేట

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీలు, సంఘాలు ఐక్యంగా ఉద్యమించాలని, ప్రజల్లోనూ చైతన్యం నింపాలని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు వి.కృష్ణయ్య అన్నారు. సిపిఎం కేంద్ర కమిటీ పిలుపు మేరకు 'దేశాన్ని రక్షించుకోవాలి స్వరాజ్యాన్ని కాపాడుకోవాలి' అనే నివాదంతో ప్రచారం చేపట్టామని చెప్పారు. సిపిఎం పల్నాడు జిల్లా కమిటీ సమావేశం స్థానిక కోటప్పకొండ రోడ్డులోని పల్నాడు విజ్ఞాన కేంద్ర ప్రాంగణంలో గురువారం నిర్వహించారు. సమావేశానికి జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎ.లక్ష్మీశ్వరరెడ్డి అధ్యక్షత వహించారు. కృష్ణయ్య మాట్లాడుతూ దేశ సంపదను మోడీ కార్పొరేట్ శక్తులకు దోచిపెడుతున్నారని, రాష్ట్రాన్ని అదానీకి అప్పగిస్తున్నారని విమర్శించారు. దేశ, రాష్ట్ర భవిష్యత్‌ను తీవ్రంగా నాశనం చేసే ఈ విధానాలపై ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. మోడీ పాలనలో లక్ష మందికి పైగా రైతులు ఆత్మహత్య చేసుకున్నారని, ఈ నేపథ్యంలో

2లో

పట్టుబడిన గ్రానైట్ లారీల వద్ద విజిలెన్స్-ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు

మరో 14 గ్రానైట్ లారీలు స్వాధీనం

అక్రమంగా తరలిస్తుండగా కారంపూడిలో పట్టుకున్న విజిలెన్స్ అధికారులు

ప్రజాశక్తి - మాచర్ల

గ్రానైట్‌ను అక్రమంగా తరలిస్తున్న 14 లారీలను విజిలెన్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అక్రమ రవాణాపై సమాచారం అందుకున్న విజిలెన్స్ అధికారులు మాచర్ల నియోజకవర్గం కారంపూడి మండల కేంద్రం శ్రీచక్ర సిమెంట్ ఫ్యాక్టరీ సాగర్ రోడ్‌లో గురువారం తనిఖీలు చేపట్టారు. గ్రానైట్‌ను తరలిస్తున్న 14 లారీలు పట్టుకుని పత్రాలు పరిశీలించగా 13

2లో

నీటి పన్ను చెల్లించలేదంటూ కుళాయి కనెక్షన్లు తొలగింపు

ప్రజాశక్తి-తాడేపల్లి

నీటి పన్ను చెల్లించలేదనే కారణంతో కుళాయి కనెక్షన్లను మన్సిపల్ సిబ్బంది తొలగిస్తున్నారు. పేదలు అధికంగా నివసించే డోలాస్‌నగర్, ప్రకాష్‌నగర్, నులకపేట తదితర ప్రాంతాల్లో ఈ పరిస్థితి ప్రధానంగా నెలకొంది. ముందస్తు సమాచారం లేకుండా, ఇంట్లో ఎవరూ లేని సమయాల్లో కనెక్షన్ తొలగింపుపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గురువారం ఒక్కరోజే డోలాస్‌నగర్‌లో ఆరు కుళాయి కనెక్షన్లు తొలగించారు. పట్టణం మొత్తం మీద సుమారు

2లో

నమూనాపై ఆచార్య నాగార్జున యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ రాజశేఖర్‌కు వివరిస్తున్న విద్యార్థులు

2లో

మేధో వికాసం.. పర్యావరణ హితం

రెండోరోజు ఉత్సాహంగా కొనసాగిన విద్యా, వైజ్ఞానిక ప్రదర్శన

నీట్‌లో రైతు బిడ్డ ప్రతిభ

2లో

విలేకరులతో మాట్లాడుతున్న చైర్మన్, నాయకులు

ఏ పూజారిని తొలగించామో పేరు చెప్పండి?

బ్రహ్మారెడ్డికి మున్సిపల్ చైర్మన్ డిమాండ్

ప్రజాశక్తి - మాచర్ల

రాజకీయాలు హుందాతనంగా ఉండాలని, ప్రశాంతంగా ఉండే గ్రామాల్లో చిచ్చు పెట్టె రాజకీయాలు వద్దని మున్సిపల్ చైర్మన్ బోయ రఘురామిరెడ్డి అన్నారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి జూలకంటి బ్రహ్మారెడ్డి బుధవారం చేసిన విమర్శలను రఘురామిరెడ్డి తీవ్రంగా ఖండించారు. దేవాలయం పూజారిని తొలగించారని తొలగించినట్లు ఆయన చేసిన ఆరోపణలు అసత్యమన్నారు. అది నిజమే అయితే పూజారి పేరును చెప్పాలని డిమాండ్ చేశారు. వైసిపి నాయకులు బి.శ్రీనివాసరావు మాట్లాడుతూ హత్యలు, దౌర్జన్యాలే ఏజెండాగా బ్రహ్మారెడ్డి రాజకీయాలు చేస్తున్నారని అన్నారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో గుంటూరులో జరిగే కౌంటింగ్ రోజు బ్రహ్మారెడ్డి అక్కడే అగిపోతారని, ఆయన అండ చూసుకొని ఆవాకులు, చవాకులు పేలే వారు తద నంతరం పరిస్థితి ఏమిటో అర్థం చేసుకోవాలన్నారు. జడ్‌పిటిసి మల్లుస్వామి మాట్లాడుతూ గత టిడిపి ప్రభుత్వ హయాంలో గిరిజన సంక్షేమానికి విడుదలైన నిధులు ఎన్ని పక్కదారి పట్టాయో, పనుల్లో ఎంత అవినీతికి పాల్పడ్డారో బ్రహ్మారెడ్డి తెలుసుకోవాలని అన్నారు. సమావేశంలో నాయ కులు చంద్రారెడ్డి, ఓరుగంటి చిన్నా, వైస్ ఎంపిపి పి.కోటిరెడ్డి పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆర్ ఐటిఐలో స్వల్పకాలిక శిక్షణ కోర్సులు

ప్రజాశక్తి - మాచర్ల

స్థానిక ప్రభుత్వ ఆర్ ఐటిఐలో స్వల్పకాలిక శిక్షణ కోర్సులను ప్రారంభించినట్లు ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ సిహెచ్ రవి కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రధాన మంత్రి కౌశిక్ వికాస్ యోజన సౌజన్యంతో ఉపాధి అవకాశాలున్న పిట్టర్ ప్రాబికేషన్, టూ వీలర్ సర్వీస్ అసిస్టెంట్ కోర్సులు ప్రారంభించినట్లు తెలిపారు. ఈ కోర్సుల కాలవ్యవధి 3 నెలలు మాత్రమేనని, వీటిని పూర్తిగా ఉచితంగా అందిస్తామని తెలిపారు. 18 ఏళ్లు నిండి 10వ తరగతి ఉత్తీర్ణులైన వారు తమ బయోడేటా, విద్యార్హతకు సంబంధించిన ఒరిజినల్ ధ్రువపత్రాలు, ఆధార్ కార్డు, 2 పాస్‌ఫోర్టు ఫొటోలతో ఆర్ ఐటిఐ కార్యాలయ పనివేళలలో సంప్రదించాలని సూచించారు. దరఖాస్తు చేసుకోవడానికి ఈ నెలాఖరు వరకూ గడువు ఉందని పేర్కొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు

ప్రజాశక్తి - తుళ్లూరు

హైకోర్టు సమీపంలోని బస్టాప్ వద్ద డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆటో వర్కర్స్ యూనియన్ గురువారం ఆధ్వర్యంలో చలి వేంద్రం ఏర్పాటు చేశారు.బార్ కౌన్సిల్ వైస్ ప్రెసిడెంట్ పిఎస్పీ సురేష్ చలివేంద్రంను ప్రారం భించారు.వేసవి కాలంలో దప్పిక తీర్చు కోవడానికి చలి వేంద్రం ఏర్పాటు అభి. నందనీయమన్నారు.హైకోర్టు న్యాయ వాదులు వరలక్ష్మి,కమల, బి.ఆర్ అంబేద్కర్ ఆటో వర్కర్స్ యూనియన్ ప్రెసిడెంట్ జెట్టి నరేష్,వైస్ ప్రెసిడెంట్ పైర్ధ నాగమల్లేశ్వం రావు పాల్గొన్నారు.

వర్ష సూచన.. పంటలు జాగ్రత్త

ప్రజాశక్తి-ఫిరంగిపురం

ఈ నెల 16, 17, 18 తేదీలలో భారీ నుండి అతి భారీ వర్షాలు కురిసే సూచనలు ఉన్నాయని మండల వ్యవసాయ శాఖ అధికారి కె.రమణకుమార్ తెలిపారు. రైతులు మిర్చి, శెనగ పంటలు ఎక్కువగా పండించారని, వర్షం కురిసే సమయంలో పట్టాలు కప్పినప్పటికీ సరుకు కుళ్లిపోయే అవ కాశాలు ఉన్నందున, ముందుగానే సురక్షిత ప్రాంతాలకు తరలించడం మంచిదని రైతులకు సూచించారు.

మేథో వికాసం .. పర్యావరణ హితం

నమూనాలను తిలకిస్తున్న పాఠశాలల విద్యార్థులు

ప్రజాశక్తి - ఎఎన్‌యు

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ విద్యా విషయక ప్రదర్శన రెండోరోజైన గురువారమూ ఉత్సాహంగా కొనసాగింది. విద్యార్థులు తమ ప్రతిభా పాఠవాలతో సందర్శకులను ఆకట్టుకుంటున్నారు. ఆరోగ్య స్పృహ, ప్రయోజనాత్మక పరిశోధనలు, మానవతా వైద్యంపై విద్యార్థులు నమూనాలుంచారు. పర్యావరణహితమైన వ్యవసాయ రంగాలకు సాంకేతిక పరిజ్ఞానం ఎలా ప్రయోజన కరంగా ఉంటుందో విద్యార్థులు కళ్లకు కట్టినట్లుగా ప్రదర్శనలతో చూపిస్తున్నారు. అత్యవసర సమయాల్లో ఉపయోగించే కృత్రిమ రక్తాన్ని కూడా ప్రదర్శించారు. బయో మైనింగ్, రాకెట్ కోస్టర్ వంటివి సందర్శకులను ఆకర్షిస్తున్నాయి. మహాత్మ జ్యోతిరావు పూలే , అంబేద్కర్, మహాత్మా గాంధీ జీవిత విశేషాలతో సైతం ఆయా విభాగాల వారు విలువైన చిత్రాలు ప్రదర్శింప చేశారు. నాణ్యమైన తృణ ధాన్యాల ఆవశ్యకతను తెలిపేలా సేంద్రీయ వ్యవసాయంపై మెలకువలు, ఫోన్ కాల్‌తో నీటి పారుదల వ్యవస్థను రూపొందించి సందర్శకులకు చూపించారు. చెవిటి, మూగ వారి భావాలను అర్థం చేసుకోవడానికి, వారితో మాట్లాడేందుకు అధునాత చేతి గ్లౌస్‌ను ప్రదర్శనకు ఉంచారు. వైర్‌లెస్ ఛార్జింగ్‌తో టెస్లా కాయిల్స్ వాడకంతో నగర వీధుల్లో అంబులెన్స్‌లకు ట్రాఫిక్ సమస్యను అధిగమించే ప్రక్రియ చూపరులను ఆకట్టుకుంది. చాట్ జీపీటీని టెలిగ్రామ్ యాప్‌తో అనుసంధాం చేశారు.

రామ్‌గోపాల్ వర్మ వ్యాఖ్యలకు నిరసన

అకడమిక్ ఎగ్జిబిషన్ ప్రారంభం సందర్భంగా సినీ దర్శకుడు రాంగోపాల్ వర్మ చేసిన వ్యాఖ్యలను విద్యార్థి సంఘాలు ఖండించాయి టిఎన్ఎస్ఎఫ్, ఎబివిపి నిరసన తెలిపాయి. వర్మ దిష్టిబొమ్మను దహనం చేశారు.

ప్రజాశక్తి-గుంటూరు

రామ్‌గోపాల్ వర్మను వెంటనే అరెస్ట్ చేయాలని కోరుతూ ఆయన దిష్టిబొమ్మను కాంగ్రెస్ నాయకులు గుంటూరులోని హిందూ కాలేజి వద్ద దహనం చేశారు. ఎన్ఎస్‌యుఐ అధ్యక్షులు షేక్.కరీమ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్.మస్తాన్‌వలి, నగర అధ్యక్షుల ఉస్మాన్ మాట్లాడుతూ మహిళలను కించపరుస్తూ, యువతను తప్పుదోవ పట్టించే విధంగా మాట్లాడిన రామ్‌గోపాల్ వర్మను వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. తల్లిదండ్రులకు, పిల్లలకు క్షమాణలు చెప్పాలని కోరారు. కార్యక్రమంలో నగర అధ్యక్షులు షేక్.ఉస్మాన్, జిల్లా ఉపాధ్యక్షులు అంబటి రత్తయ్య, సుమంత్, నాగూర్ పాల్గొన్నారు.

బిజెపి విధానాలపై ప్రచారోద్యమం

(మొదటి పేజీ తరువాయి)

వ్యవసాయాన్ని, రైతులను కాపాడుకోవడానికి 5న నిర్వహించే చలో ఢిల్లీకి రైతులు లక్షలాదిగా తరలిరావాలని పిలుపునిచ్చారు.

సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయ్‌కుమార్ మాట్లాడుతూ నేటి నుండి ఈనెల 31 వరకు సిపిఎం పల్నాడు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లాలో ప్రచారం నిర్వహిస్తామని చెప్పారు. చలో ఢిల్లీకి వెళ్లే రైతులు, కార్మికులకు సహాయ సహకారాలు అందిస్తామన్నారు. ప్రజలందరికీ విజ్ఞానాన్ని పంచేందుకు విజ్ఞాన కేంద్రం అవసరమని, సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు, అభ్యుదయ భావాల పెంపొందించేందుకు విజ్ఞాన కేంద్రం ఏర్పాటు చేసేందుకు ఇప్పటికే నిర్ణయించిన నేపథ్యంలో అందుకు సిపిఎం పూర్తి సహకారం అందిస్తుందని అన్నారు. ఇందులో భాగంగా ఈనెల 26న భవన శంకుస్థాపనకు అందరూ సహకరించాలని కోరారు.

సీనియర్ నాయకులు గద్దె చలమయ్య మాట్లాడుతూ దేశంలో విపత్కర పరిస్థితులు నెలకొన్నాయని, అప్రకటిత ఎమర్జెన్సీ అమలవుతోందని ఆందోళన వెలిబుచ్చారు. కేంద్ర విధానాలను వ్యతిరేకించిన వారిపై ఇడి, సిపిఐ, ఐటి దాడులు చేస్తున్నారని మండిపడ్డారు. ఈ తరహా రాజకీయాలను ప్రజలు ప్రతిఘటించాలన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి.రవిబాబు మాట్లాడుతూ పల్నాడు జిల్లాలో దళితులపై దాడులు ఎక్కువయ్యాయని, అయినా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. కేసులు నమోదు చేయడం లేదని, బాధితులకు అండగా ఉండడంలేదని, పైగా కేసులను పక్కదారి పట్టిస్తున్నారని మండిపడ్డారు. గురజాల, చిలకలూరిపేట నియోజకవర్గాలతో పాటు అనేక ప్రాంతాలలో దళితులు సాగు చేసుకునే భూములకు కూడా రక్షణ లేకుండా పోయిందన్నారు. దీనిపై సిపిఎం పెద్దఎత్తున పోరాడుతుందన్నారు. ఈ సందర్భంగా దేశానికి మోదాని ముప్పు పుస్తకాన్ని ఆవిష్కరించారు. సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వై.రాధాకృష్ణ, ఎ.గోపాల్‌రావు, ఎస్.ఆంజనేయ నాయక్, నాయకులు డి.శివకుమారి, జిమల్లీశ్వరి, కె.హనుమంతరెడ్డి, టి.పెద్దిరాజు, జి.బాలకృష్ణ, బి.మహేష్, డి.విమల, ఫాతిమా పాల్గొన్నారు.

మరో 14 గ్రానైట్ లారీలు స్వాధీనం

(మొదటి పేజీ తరువాయి)

లారీలకు మైనింగ్ ట్రాన్సిట్ పాసులు లేవని, ఒక లారీకి వే బిల్లులు లేవని గుర్తించారు. వీటిని స్వాధీనం చేసుకుని దాచేపల్లి మైన్స్ అసిస్టెంట్ డైరెక్టర్‌కు అప్పజెప్పారు. తనిఖీల్లో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెర్ డీఎస్పీ సిహెచ్ శ్రీనివాసరావు, ఇన్‌స్పెక్టర్ పి.లక్ష్మిరెడ్డి, అసిస్టెంట్ ఎన్.ప్రసాద్, సీనియర్ అసిస్టెంట్ కె.మల్లికార్జున్‌రెడ్డి పాల్గొన్నారు. రెండ్రోజుల కిందట మాచర్ల పట్టణంలో ఏడు లారీలు పట్టుకున్న అధికారులు తాజాగా 14 లారీలను స్వాధీనం చేసుకోవడం సంచలనంగా మారింది. ప్రకాశం, బాపట్ల, గుంటూరు, పల్నాడు జిల్లాల నుండి గ్రానైట్‌ను లారీల్లో కారంపూడి మీదుగా మహారాష్ట్ర, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు అక్రమంగా రవాణా చేస్తున్నారు.

21న ధర్నాను విజయవంతం చేయండి

ప్రజాశక్తి- ప్రత్తిపాడు

ఆశా వర్కర్లు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 21వ తేదీన అన్ని జిల్లాల డిఎంహెచ్ఒ కార్యాలయాల వద్ద నిర్వహించే ధర్నా కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఆశా వర్కర్స్ యూనియన్ గొట్టిపాడులోని పిహెచ్సి డాక్టర్ కేజియా గ్రేస్‌కు గురువారం వినతిపత్రం అందజేశారు. సిఐటియు ఎపి ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర పిలుపు మేరకు ఈ ధర్నా కార్యక్రమాలు చేపట్టనున్నారు.ఈ సందర్భంగా జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్.ధనలక్ష్మి మాట్లాడుతూ ఆశ వర్కర్లకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, వారి పని భారం తగ్గించాలని, జాబ్‌ఛార్ట్‌తో సంబంధం లేని పనులను ఆశ వర్కర్లతో చేయించొద్దని అన్నారు. ప్రత్తిపాడు మండల అధ్యక్షులు కె.జ్యోతి మాట్లాడుతూ ఆశ లకు రూ.10 లక్షల గ్రూప్ ఇన్సూరెన్స్ కల్పించాలని, విధి నిర్వహణలో మృతి చెందిన వారి కుటుంబ సభ్యులకు ఆశ నియామకాల్లో తగు ప్రాధాన్యత ఇవ్వాలని డిమాండ్ చేశారు. విలేజ్ హెల్త్ క్లినిక్, సచివాలయంలో ఆశ వర్కర్లు డ్యూటీ చేయకూడదనే మొదలైన డిమాండ్లు నెరవేర్చాలని అన్నారు. కార్యక్రమంలో ఆశ వర్కర్లు విమల కుమారి, కస్తూరి పాల్గొన్నారు.

నీట్‌లో రైతు బిడ్డ ప్రతిభ

ప్రజాశక్తి- నూజెండ్ల



మండలంలోని ములకలూరులో సామాన్య రైతు కుటుంబానికి చెందిన కావూరి కృష్ణచైతన్య ఏలూరు ఆశ్రమ్ మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ చదువుతున్నారు. మెడిసిన్ ఐదేళ్లలో కాలేజీ టాపర్‌గా నిలిచిన కృష్ణచైతన్య తాజాగా పీజీలో (నీట్) ఆల్ ఇండియాలో 2903 ర్యాంకు సాధించారు. దీంతో కృష్ణచైతన్యకు గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

నీటి పన్ను చెల్లించలేదంటూ కుళాయి కనెక్షన్లు తొలగింపు

(మొదటి పేజీ తరువాయి)

50 కనెక్షన్లు తొలగించినట్లు సమాచారం. బకాయిలు చెల్లించడానికి గడువున్నా ట్యాప్‌లకు డమ్మీలు వేస్తున్నారని ప్రజలు మండి పడుతున్నారు. ఈ ప్రాంతాల్లో రెండ్రోజులకొకసారి ఒక్కపూట మాత్రమే నీరు సరఫరా చేస్తారని, తాగు, గృహ అవసరాలకు ఇవి సరిపోగా నానా అగచాట్లు పడుతున్నామని ఇక్కడివారు వాపోతున్నారు.

పెరిగిన జనాభా అవసరాల రీత్యా తాడేపల్లి పట్టణానికి 10 ఎంఎల్‌డి (మిలియన్ లీటర్ పర్ డే) నీరు అవసరం కాగా ప్రస్తుతం 3 ఎంఎల్‌డిలే సరఫరా చేస్తున్నారు. పక్కనే కృష్ణా నది ఉన్నా స్థానికులకు మాత్రం నీటి ఇక్కట్లు తప్పడం లేదు. మున్సిపల్ అధికారులు, పాలకులకు సరైన ప్రణాళిక లేకపోవడం ఇందుకు ప్రధాన కారణమనే విమర్శలు గతం నుండీ ఉన్నాయి. గత ప్రభుత్వ హయాంలో పైలెట్ ప్రాజెక్టు స్కీం ఏర్పాటుకు డిపిఆర్ కోసం రూ.60 లక్షలు ఖర్చు చేసినా అది కార్యరూపం దాల్చలేదు. ఎత్తిపోతల ద్వారా కృష్ణా నది నీటిని తెచ్చి ప్రస్తుతం పాత ఐఒసి సమీపంలో నిర్మిస్తున్న చర్మకారుల భవనం దగ్గర వాటర్ ప్లాంట్ నిర్మాణం చేపట్టాలని నిర్ణయించినా ఆ ప్రతిపాదనలు ఏమయ్యాయో తెలీదు. భూగర్భ జలాలూ అడుగంటాయి. వేసవి నేపథ్యంలో ప్రజల నీటి కష్టాలు మరింత తీవ్రరూపం దాల్చే అవకాశం ఉంది.

అయితే ఇవన్నీ పరిష్కరించిన పాలకులు, యంత్రాంగం పేదల కుళాయి కనెక్షన్ల తొలగిపులో మాత్రం అత్యుత్సాహం చూపుతున్నారనే విమర్శలు వస్తున్నాయి. సేవలు పొందాలంటే డబ్బులు చెల్లించాలనే సంస్కరణలను కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తుండగా వాటిని రాష్ట్ర ప్రభుత్వమూ తూచ తప్పకుండా పాటిస్తోంది. పేదల ఇళ్లల్లో కుళాయి కనెక్షన్ల తొలగింపు ఇందుకు తాజా ఉదాహరణ. ఈ క్రమంలో అధికారులు తీరును సిపిఎం పట్టణ కార్యదర్శి బి.వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో ఖండించారు. బిల్లుల చెల్లింపునకు వ్యవధి ఇవ్వాలని, నీటి సరఫరాను యథావిధిగా సరఫరా చేయాలని డిమాండ్ చేశారు.

పన్ను చెల్లింపుదారులకు అపరాధ రుసుం మినహాయించాలి : గల్లా

ప్రజాశక్తి-గుంటూరు :వార్షిక రిటర్న్ పన్ను చెల్లింపుదారులకు అపరాధ రుసుం రద్దు చేయాలని బుధవారం ఎంపి గల్లాజయదేవ్ 377 కింద లోక్‌సభలో కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. జిఎస్‌టి, ఆర్9, 9సి4 మొదలైన వాటికి లేటు రుసుములు లేకుండా కొన్ని పరిమితుల మేరకు వర్తింప చేయమని కౌన్సిల్‌ను ఆర్థిక శాఖ కోరారని, నోటిఫికేషన్ లేకుండానే వ్యాపారస్తులకు నోటీసులు ఇస్తున్నారని ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చారు. కోవిడ్ ప్రభావంతో రిటర్న్‌లు దాఖలు చేయలేని వారిని, వారి సమస్యలను పరిగణలోకి తీసుకొని, ఆలస్య రుసుము మాఫీ చేయటం ద్వారా ఉపశమనం కల్పించాలని కోరారు.

పాము కాటుతో మహిళ మృతి

ప్రజాశక్తి - నాదెండ్ల

పాముకాటుతో మహిళ మృతి చెందిన సంఘటన మండలంలోని జంగాలపల్లి గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. నాదెండ్ల ఎస్ఐ ఆవుల భాస్కర్ తెలిపిన వివరాల ప్రకారం రొంపిచర్ల మండలం విప్పర్ల అగ్రహారం గ్రామానికి చెందిన యశంపాటి శ్రీనివాసరెడ్డి, అతని భార్య విజయలక్ష్మీ జంగాలపల్లిలో ఇల్లు అద్దెకు తీసుకుని కూలి పనులు చేసుకుంటున్నారు. రోజు మాదిరిగానే గురువారం విజయలక్ష్మీ (47) కాటం రాజు మిరప పొలంలో కాయలు కోయడానికి వెళ్లింది. ఈ క్రమంలో పాము కాటుకు గురైందన్నారు. వెంటనే విజయలక్ష్మీని నరసరావుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. విజయలక్ష్మీ భర్త ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కార్మిక,కర్షక చలో ఢిల్లీని జయప్రదం చేయండి

ఐనవోలు ప్రచారంలో పాల్గొన్న ఎం రవి , భాగ్యరాజు

పెదకాకాని ప్రచారంలో మాట్లాడుతున్న ఎన్ శివాజి

తాడేపల్లిలో ప్రచారం

ప్రజాశక్తి-తాడేపల్లి

కేంద్రంలోని మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక నిరంకుశ విధానాలను ప్రతిఘటించాలని సిఐటియు తాడేపల్లి పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు కోరారు. తాడేపల్లి పట్టణంలోని పారిశుధ్య కార్మికులను సమావేశ పరిచి గురువారం చలో డిల్లీ కార్యక్రమానికి తరలిరావాలని కోరారు. ఈ సందర్భంగా కరపత్రాలను పంపిణీ చేశారు. ప్రకాష్‌నగర్, కృష్ణని గుడి సెంటర్లలో జరిగిన గ్రూపు మీటింగుల్లో సిఐటియు నాయకులు బూరుగ వెంకటేశ్వర్లు మాట్లాడారు. కార్యక్రమంలో కామాక్షి, వి.సహస్, నాని, రాంబాబు, లక్ష్మి, శ్రీను, ఎస్‌కె మస్తాన్, దుర్గారావు, మరియమ్మ, రమేష్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి - తుళ్లూరు

కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఏప్రిల్ 5 వ తేదీన జరిగే ఛలో ఢిల్లీ కార్యక్రమానికి అన్ని వర్గాల ప్రజలు పెద్ద సంఖ్యలో తరలి రావాలని సిఐటియు రాజధాని డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎం రవి, ఎం భాగ్యరాజు పిలుపు నిచ్చారు. ఛలో ఢిల్లీ జయప్రదం చేయాలని కోరుతూ గురువారం రాజధాని గ్రామం ఐనవోలులో కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రవి,భాగ్యరాజు మాట్లాడుతూ లేబర్ కోడ్ లు రద్దుచేసి కార్మిక చట్టాలు పునరుద్ధరించాలని, రాజధాని అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం నిధులు కేటాయించాలని, నిత్యవసర వస్తువుల ధరలు తగ్గించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు గడ్డం కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - మంగళగిరి

సిఐటియు ఆధ్వర్యంలో ఏప్రిల్ 5 చలో ఢిల్లీ కార్యక్రమంలో భాగంగా ఎన్టీఆర్ కాలనీలో సిఐటియు పెదకాకాని మండల కమిటీ ఆధ్వర్యంలోఇంటింటికి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి నన్నపనేని శివాజీ మాట్లాడుతూ కేంద్రంలో తొమ్మిదేళ్ల బిజెపి పాలన వల్ల దేశంలో గ్యాస్ పెట్రోల్ డీజిల్ మందులు ఆహార పదార్థాలు నిత్యవసర వస్తువులు సరుకులు ధరలు విపరీతంగా పెరిగాయని అన్నారు. ఆటో ప్రైవేట్ ట్రాన్స్పోర్ట్ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని అంగన్వాడి ఆశ మధ్యాహ్నం భోజనం స్కీం వర్కర్లకు కనీస వేతనం రూ.26,000 ఇవ్వాలని స్కీం వర్కర్లను కార్మికులుగా గుర్తించి పెన్షన్ తో కూడిన రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పోటాట శివ నాగేశ్వరరావు, రాం బట్లు, ఏ నాగేశ్వరరావు, కె గోపి, రామారావు తదితరులు పాల్గొన్నారు.

906 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం

ప్రజాశక్తి - నకరికల్లు :పేదలకు పంపిణీ చేయాల్సిన రేషన్ బియాన్ని నకరికల్లు మండలం చల్లగుండ్ల గ్రామంలోని వనదుర్గ రైస్ మిల్లులో రిసైక్లింగ్ చేసి విక్రయిస్తున్న సమాచారం మేరకు ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. మిల్లులో స్టాక్ రిజిస్టర్‌లో ఉండాల్సిన దానికన్నా 125.83 క్వింటాళ్ల తక్కువగా ఉన్నట్లు తేలింది. లీజుదారుడు శ్రీనివాసరావును విచారించగా చుట్టుపక్కల గ్రామాల నుండి సబ్సిడీ బియ్యం కొని, మిల్లులో రీ సైక్లింగ్ చేసి అమ్ముకుంటున్నామని తెలిపాడు. మిల్లులోని 906 క్వింటాళ్ల సబ్సిడి బియ్యాన్ని అధికారులు స్వాధీన పరుచు కొన్నారు. నిత్యావసర సరుకుల చట్టం క్రింద 6-ఎ కేసుతో పాటు మిల్లు లీజు దారు టి.శ్రీనివాసరావుపై క్రిమినల్ కేసు కూడా నమోదు చేయవలసినదిగా స్థానిక సివిల్ సప్లయిస్ డిప్యూటీ తహసీల్దారు వారిని విజిలెన్స్ అధికారులు ఆదేశించారు. తనిఖీల్లో విజిలెన్స్ డీఎస్పీ శ్రీనివాసరావు, తహశీల్దార్ కె.నాగమల్లేశ్వరరావు, సిఐ శ్రీహరిరావు, ఎస్ఐ రామచంద్రయ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్‌బిఐ క్రెడిట్‌కార్డు విభాగానికి వినియోగదారుల కమిషన్ వడ్డింపు

ప్రజాశక్తి-గుంటూరు లీగల్

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా క్రెడిట్ కార్డు విభాగం వారు ఫిర్యాదుదారుడైన పాల సుకుమార్‌కు రూ.1,35,453 చెల్లించాలని గుంటూరు జిల్లా వినియోగదారుల కమిషన్ గురువారం ఉత్తర్వులు ఇచ్చింది. గుంటూరు నగరం, చంద్రమౌళినగర్‌కు చెందిన సుకుమార్ ఎస్‌బిఐలో చీఫ్ మేనేజర్‌గా పనిచేస్తున్నారు. ఆయన ఎస్‌బిఐ క్రెడిట్ కార్డును తీసుకొని లావాదేవీలు జరుపుతున్నారు. ఆయన క్రెడిట్ కార్డు నుండి, అతనికి తెలియకుండా రూ.32,453లు కట్ అయ్యాయి. ఈ విషయం అతనికి నెలవారీ స్టేట్‌మెంట్‌లో తెలిసిన వెంటనే ఎస్‌బిఐ వారిని సంప్రదించారు. ఏవిధమైన ఓటిపి రాకుండనే డబ్బులు కట్ అయినందున తిరిగి తన ఖాతాకు జమ చేయాలని కోరారు. నోటీసులు కూడా పంపించారు. ఎస్‌బిఐ క్రెడిట్‌కార్డు విభాగం వారు తమకు సంబంధం లేదని సమాధానం పంపించారు. దీంతో సుకుమార్ వినియోగదారుల కమిషన్‌ను ఆశ్రయించారు. ఇరువురి వాదనలూ విన్న కమిషన్ అధ్యక్షురాలు తాడికొండ సునీత, కమిషన్ సభ్యులు కె.విజయలక్ష్మి, జి.పున్నారెడ్డి తీర్పు వెలువరిస్తూ ఫిర్యాదుదారుడు సుకుమార్‌కు క్రెడిట్ కార్డు నుండి కట్ అయిన రూ.32,453, నష్టపరిహారం క్రింద రూ.1లక్ష, ఫిర్యాదు ఖర్చుల కింద రూ.3వేలు ఆరు నెలల్లో చెల్లించాలని ఎస్‌బిఐ క్రెడిట్ కార్డు విభాగం వారిని ఆదేశించారు. నిర్దేశిత గడువులోగా చెల్లించకపోతే 9శాతం వడ్డీతో కలిపి చెల్లించాల్సి ఉంటుందని, ఆయన సివల్ స్కోర్‌కు కూడా ఏ భంగం కలగకుండా చూడాలని తీర్పులో పేర్కొన్నారు. ఫిర్యాదు తరపున న్యాయవాది డి.రవీంద్రబాబు వాదించారు.

జిజిహెచ్ ట్రామాకేర్‌లో మూడు ఖాళీల భర్తీ

ప్రజాశక్తి-గుంటూరు :జిజిహెచ్‌లో ట్రామాకేర్ సెంటర్‌లో ఖాళీగా ఉన్న మూడు పోస్టులు భర్తీ అయ్యాయి. రెండు బయోమెడికల్ టెక్నీషియన్ పోస్టులు, ఒక డేటా ఎంట్రీ ఆపరేటర్ పోస్టుకు కాంట్రాక్ట్ ప్రాతిపదికన నియామకాలు చేశారు. ఈ మేరకు అభ్యర్థులకు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ప్రభావతి నియామక పత్రాలు అందచేశారు. కార్యక్రమంలో ఏడీ నాగేశ్వరరావు, మేనేజర్ మురళి, ఎం.శ్రీనివాస్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

జిఎంసి సిటీ ప్లానర్‌గా ప్రదీప్‌కుమార్ బాధ్యతలు స్వీకరణ

ప్రజాశక్తి-గుంటూరు: గుంటూరు నగరపాలక సంస్థ సిటీ ప్లానర్‌గా నియమితులైన ప్రదీప్‌కుమార్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. నగర కమిషనర్ కీర్తి చేకూరిని కలిసి జాయినింగ్ రిపోర్ట్ అందచేశారు. పాలక వర్గం, అధికారులతో కలిసి నగర అభివృద్ధికి కృషి చేస్తామని ప్రదీప్‌కుమార్ తెలియజేశారు.

ఒరిజినల్ దస్తావేజు పోయినది

గుంటూరుజిల్లా, తెనాలి పట్టణం, చెంచుపేట డొంక రోడ్డు, డోర్ నెం. 11-4-48/4 నివాసం వుంటున్న బంధం రంగారావు కుమారుడు బంధం ప్రసాద్ ఫిబ్రవరి 15, 2023 తేదీన బ్యాంక్ లావాదేవీల నిమిత్తం రైలులో తెనాలి నుండి గుంటూరు వెళ్ళి తిరిగి వస్తుండగా ఒరిజినల్ దస్తావేజు నెం. 1162/1903 ఉన్న బ్యాగ్ జారిపోయినది. పై దస్తావేజు కలిగిన బ్యాగ్ ఎవరికైనా దొరికిన యెడల ఈ క్రింది అడ్రస్సునకు అందజేయగలరు.

ఇట్లు
కోగంటి శివశంకరరావు,
న్యాయవాది, మారీస్‌పేట,
తెనాలి. ఫోన్ : 944026 1117

CHANGE OF NAME

I, SYED MUJIB S/o.SD. JANI R/o.D.No.4-28-70, Dange Vari Street, Ithanagar, Tenali - 522201, changed my name to SYED MUJEEB as per affidavit dated: 15-03-2023 before Notary, BRENHAM SIKHA, Tenali.

పొన్నూరు పురపాలక సంఘము
కొటేషన్ నోటీసు

ఆర్.ఓ.సి. నెం. 121/2023/ఇ1 తేది : 15-03-2023

పొన్నూరు పురపాలక సంఘ పరిధిలోని వివిధ గ్రాంట్లు ద్వారా పనులను చేపట్టుటకు మరియు పూర్తి చేయుటకు 3వ పార్టీ క్వాలిటీ కంట్రోల్ వారి పరిశీలన చేయుటకు గాను అర్హత గల కన్సల్టెన్సీ నుండి కొటేషన్లు స్వీకరించుటకు తేది : 16-3-2023 నుండి తేది : 24-3-2023 వరకు స్వీకరించబడును. అర్హతలను కొటేషన్ నోటీసు నందు పొందుపరచడమైనది. కొటేషన్ నోటీసును ఆఫీసు నోటీసు బోర్డు నందు ఉంచడమైనది.

సం॥ శ్రీమతి డా॥ ఎన్.రాధ, పి.హెచ్.డి.
కమీషనర్,
పొన్నూరు పురపాలక సంఘం.

Court Notice
IN THE COURT OF THE HON'BLE III ADDL. JUNIOR CIVIL JUDGE::GUNTUR
O.S.No:448 / 2019

Between:
State Bank of India, RACPC ,Guntur,
Rep.by its Manager-Recovery .... Plaintiff
AND
Balijepalli Harika & Others ... Defendants
To,
D-1: Balijepalli Harika, D/o.Venkata Vara Prasada Rao,
D-2: Balijepalli Venkata Vara Prasada Rao, S/o.Sri Rama Murthy, Both are R/o.#2-14-14, Narisireddy Colony, Stambalagaruvu, Guntur.
D-3: Sikha Lakshmi Narayana, S/o.Satyanarayana R/o.in the house of Venkayamma, Opp.Appadala Company, Sampath Nagar, Guntur.

పై నెంబరు దావాలో ప్రతివాదులు అయిన మీకు శ్రీ కోర్టు వారి ద్వారా నోటీసులు/ సమన్లు పంపించినను మీరు తీసుకొనక కాలయాపన చేయుచున్నందున శ్రీ కోర్టు వారు మీకు Substitute Service ద్వారా పేపరులో ప్రకటన ద్వారా తెలియపరచమని ఆర్డరు వేయగా, సదరు ఆర్డరు ప్రకారము మీరు ది: 03-04-2023న ఉ. గం.10-30 ని.లకు పై తెలిపిన కోర్టునకు మీరు స్వయంగా కాని, మీ అడ్వకేటు ద్వారా గాని హాజరు అయి మీ ఆక్షేపణలు తెలియపరచుకొన వలయును. లేనియెడల మీ పరోక్షమందు విచారించి తీర్మానించబడునని తెలియపర్చడమైనది.

(శ్రీ కోర్టు వారి అనుమతితో)
వాయిదా తేది:03-04-2023

కె.వి.ఆర్.హెచ్.ప్రసాద్,
వాది తరపు అడ్వకేట్,
రవీంద్రనగర్, గుంటూరు.
సెల్: 9849084816

మహారాజశ్రీ ఒంగోలు 1వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు వారి ఎదుట ఒంగోలు
O.S.No.506/2020

Between
గంగిరెడ్డి రమణరెడ్డి ...వాది
మరియు
అల్లాటిపల్లి వెంకటరామిరెడ్డి ... ప్రతివాది
To,
అల్లాటిపల్లి వెంకట రామి రెడ్డి, S/o నారాయణ రెడ్డి, R/o విప్పర్ల శివారు, రెడ్డి పాలెం గ్రామం, రొంపిచెర్ల మండలం, గుంటూరు జిల్లా.

పై దావా ను వాది తనకు మీ వద్ద నుండి రావలసిన రొక్కంను రాబట్టు కొనుటకు శ్రీయుత కోర్ట్ వారి ఎదుట దాఖలు చేసియున్నారు. పై దావా తేది: 31.03.2023 నకుమీ యొక్క హాజరు నిమిత్తం వాయిదా అయిఉన్నది. పై తేదిన ఉ: 10.30 ని. మీరు ప్రత్యక్షముగా గాని న్యాయవాది గారి ద్వారా గాని హాజరు అయి మీ యొక్క ఆక్షేపణలను తెలుపు కొనవలయును. లేని యడల మీయొక్క పరోక్ష మందు కేసు తీర్మానం చేయబడును.

// కోర్టు వారి ఉత్తర్వుల మేరకు //
వాయిదా తేది: 31.03.2023.

ఇట్లు
ఇనకొల్లు వెంకటేశ్వర్లు,
చక్కా బాలచెన్నయ్య,
న్యాయవాదులు, ఒంగోలు.

GENERAL NOTICE
IN THE COURT OF THE HON'BLE PRL.SENIOR CIVIL JUDGE:GUNTUR
S.O.P.No:39/2022

Between:
Gandham Bharathi Devi, W/o.Late Radha Krishna Murthy, R/o.Door No:31-6-534, Arundel Pet, 6/4, Guntur ...Petitioner
And
1) Gandham Seethamma, W/o. Late Gandham Naga Murali Krishna, R/o.Door No:31-6-534, Arundel Pet 6/4, Guntur.,
2)The Principal, Womens College, Sambasiva Pet, Guntur ...Respondents

పై నెంబరు S.O.Pలోని పిటీషనరు తన కుమారుడు అయిన గంధం నాగ మురళీ కృష్ణ 2వ రెస్పాండెంట్ కాలేజీలో పని చేస్తూ మరణించినందున అతని యెక్క డెత్ బెనిఫిట్స్ లో 1/2 వంతు వాటాను 2వ రెస్పాండెంట్ వద్ద నుండి పొందుటకై పిటిషన్ దాఖలు చేయగా శ్రీ కోర్టు వారు ఎవరికైన అభ్యంతరములు ఉంటే తెలుపుకొనవలసినది గా కోరుచూ జనరల్ నోటీసు నిమిత్తం ది:08-05-2023 కి వాయిదా వేసినారు. కావున ఆ రోజున ఉ.గం. 10-30 ని.లకు. ఆక్షేపణలు ఉన్నవారు పై కోర్టు వారి ఎదుట స్వయంగా గాని, మీతరపు వకీలు గారి ద్వారా గాని హజరై తెలుపుకొనవలెను. లేనిచో శ్రీకోర్టు వారిచే చట్టప్రకారం తీర్మానించబడును.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

కె.వి.రఘునాథ్,
పిటీషనరు తరపు అడ్వకేట్,
గుంటూరు.

దావా సమన్లు
మహారాజశ్రీ గుంటూరు ప్రిన్సిపల్ జిల్లా జడ్జి వారి కోర్టులో
O.S.No:213/2014

బిట్వీన్:
గుడపాటి రమేష్ వగైరా ... వాదులు
మరియు
1) అవుతు అన్నపూర్ణమ్మ (డైడ్),
2) అవుతు భాస్కర రెడ్డి వగైరాలు ... ప్రతివాదులు
టు,
3వ ప్రతివాది: తిక్కురు మంగమ్మ, భర్త నారాయణ రెడ్డి
4వ ప్రతివాది : సానికొమ్ము వెంకటరెడ్డి, తండ్రి కొండారెడ్డి, ఇరువురి నివాసము, మల్లవరం గ్రామము, గుంటూరు (రూరల్ మండలం & జిల్లా)

పై నెంబరు దావాలో 3 & 4 ప్రతివాదులు అయిన మీకు శ్రీ కోర్టు వారి ద్వారా సమన్లు పంపించినను మీరు తీసుకోనక కాలయాపన చేయుచున్నందున శ్రీ కోర్టు వారు మీకు Substitute Service ద్వారా పేపరులో ప్రకటన ద్వారా తెలియపరచమని ఆర్డరు వేయగా, సదరు ఆర్డరు ప్రకారము మీరు ది: 31-03-2023న ఉ. గం.10-30 ని.లకు పై తెలిపిన కోర్టునకు మీరు స్వయంగా కాని, మీ తరపు అడ్వకేటు ద్వారా గాని హాజరు అయి మీ ఆక్షేపణలు తెలియ పరచుకొన వలయును. లేనియెడల మీ పరోక్షమందు విచారించి తీర్మానించబడునని తెలియపరచడమైనది.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
వాయిదా తేది:31-03-2023

యడ్లపల్లి రామశేషయ్య,
మల్లెల నర్మద,
వాదులు తరపు న్యాయవాదులు,
4/2అరండల్ పేట, గుంటూరు.
సెల్:94402 01367

పబ్లికేషను
మహారాజశ్రీ గుంటూరు 2వ అదనపు జిల్లాజడ్జి గారి కోర్టులో
ఐ.ఎ. 567/2020 ఇన్ ఓ.యస్. 160/2009

వి.రమ్య ప్రియాంక వగైరాలు ... పిటీషనర్లు
అండ్
వి.వెంకట సత్యకృష్ణకుమార్ వగైరాలు ... రెస్పాండెంట్లు
టు :
ఆర్1 : వలివేటి వెంకట సత్యకృష్ణకుమార్, తండ్రి : లేటు రోశయ్య, హిందువు, వయస్సు 47 సం॥లు, సా॥ భారత్ పెట్రోల్ బంకు, గణేష్‌మహల్ ఎదురు, కొత్తపేట, గుంటూరు టౌన్ & JCJC

ఈ నెంబరు పిటీషనులో పిటీషనర్లు, మీ వగైరాలపై ఫైనల్ డిక్రీ పాస్ చేయించమని మరియు అడ్వకేటు కమీషనరుగారిని అప్పాయింట్ చేయించమని కోరుచూ ఈ పిటీషను దాఖలు చేయగా సదరు పిటీషనులో మీకు ఎన్నిసార్లు కోర్టు ద్వారాను, పోస్టు ద్వారాను నోటీసులు పంపించిననూ మీరు తీసుకోనందువలన ఈ పేపరు ప్రకటన ద్వారా తెలియజేయటమైనది. గాన మీరు ది. 04-04-2023వ తేదీ ఉదయం 10-30 గం.లకు పై కోర్టువారి ఎదుట హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపు కోవలెను. లేనియెడల మీ పరోక్షమందు విచారించి తీర్మానించబడును.

వాయిదా: 04-04-2023

ఇట్లు
పదాల విజయకిరణ్,
వంగా శ్రీనివాసరెడ్డి,
పిటీషనర్లు తరపు న్యాయవాదులు,
6/12 బ్రాడీపేట, గుంటూరు.
సెల్ : 9848996102.

తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

నల్ల బ్యాడ్జీలతో రెవెన్యూ సిబ్బంది నిరసన

ప్రజాశక్తి - రాజుపాలెం

ఎపి జెఎసి అమరావతి పిలుపు మేరకు మండల కేంద్రంలో ఉద్యోగులు నిరసన చెప్పారు. రాజుపాలెం తహశీల్దార్ కార్యాలయం వద్ద గురువారం రెవెన్యూ సిబ్బంది నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. విఆర్ఒల సంఘం పల్నాడు జిల్లా అధ్యక్షులు కె.వేదాంతరావు మాట్లాడుతూ ఎన్నికలకు ముందు వైసిపి ఇచ్చిన హామీ ప్రకారం సిపిఎస్‌ను రద్దు చేయాలని, ఓపీఎస్‌ను పునరుద్ధరించాలని కోరారు.

పొలాన్ని పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు, అధికారులు, రైతులు

పల్లాకు తెగులును తట్టుకునే విత్తనాలు

ప్రజాశక్తి-ఈపూరు

తెగుళ్లు తట్టుకునే మినుము నూతన రకాలు అందుబాటులో ఉన్నాయని, వాటితో పంట సాగు చేయడం ద్వారా పెట్టుబడి తగ్గి లాభాలు పొందవచ్చని శాస్త్రవేత్త ఎం.నగేష్ (ఎంటమోలజి) అన్నారు. మండలంలోని కొచ్చర్లలో గురువారం క్షేత్ర ప్రదర్శన చేశారు. మినుము ఎల్బీజీ 932, ఎల్బిజి 752 నూతన రకాలైన చిరు సంచులు (మినికిట్) గ్రామానికి చెందిన రైతులు గోలి అంకారావు, గోలి రత్తయ్య సాగు చేయగా శాస్త్రవేత్తలు వాటిని పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ రకం మొక్కలు పల్లాకు, బూడిద తెగులును తట్టుకుంటాయని, దిగుబడి ఎకరాకు 8 నుండి 9 క్వింటళ్ల వరకు వస్తుందని చెప్పారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి ఆర్.రామారావు, గ్రామ వ్యవసాయ సహాయకులు కె.కిషోర్ కుమార్ పాల్గొన్నారు.

పౌష్టికాహార కిట్‌లను అందిస్తున్న వైద్యులు

క్షయ పీడితులకు పౌష్టికాహారం పంపిణీ

ప్రజాశక్తి - యడ్లపాడు : క్షయ పీడుతులకు మండల కేంద్రమైన యడ్లపాడులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం పౌష్టికాహారం కిట్లను అందించార. ఎంపిపి పి.ఝాన్సీ సాగర్, వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రుణాలు, బకాయిలను వసూలు చేయాలి

ప్రజాశక్తి - నూజెండ్ల నూజెండ్ల మండలం డిఆర్‌డిఎ వైయస్సార్ క్రాంతి పథం ఇన్‌ఛార్జి ఎపిఎంగా గడ్డం సత్యానందం బాధ్యతలు చేపట్టారు. ఈయన గతంలో బొల్లాపల్లి మండలంలో పని చేసి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిసిలు, విఒఎలు బ్యాంకు లింకేజీ లోన్లు, శ్రీనిధి లోన్లు సిఐఎఫ్ రుణాలు మొండి బకాయిలు నూరు శాతం రికవరీ చేయాలని కోరారు.

ఉన్నట్టుండి వాన.. మిర్చి రైతు ఆందోళన..

ప్రజాశక్తి-పెదకూరపాడు

మారిన వాతావరణ పరిస్థితులతో మిర్చి రైతులు ఆందోళనకు గురవుతున్నారు. వర్షాల వస్తాయనే వాతావరణ శాఖ ప్రకటనతో కళ్లాల్లోని పంటను కాపాడుకోవడానికి ఉరుకులు పరుగులు పెడుతున్నారు. ఈ క్రమంతో గురువారం మధ్యాహ్నం, సాయంత్రం స్వల్పంగా చినుకులు పడడంతో రైతుల్లో ఆందోళన మరింత పెరిగింది.

పెదకూరపాడు మండలంలో 9 వేల ఎకరాల్లో మిర్చి సాగైంది. మూడేళ్ల నుండి తామర, నల్లి దాడితో మిర్చిరైతులు తీవ్రంగా నష్టపోయారు. ఈ ఏడాది పంటను కాపాడుకోవడానికి అనేక మందులు వాడి అప్పుల పాలయ్యారు. గతంలో సీజన్‌లో 25 సార్లు మందులు పిచికారీ చేస్తే ఈ ఏడాది 50 సార్లు పిచికారీ చేశారు. దీంతో పెట్టుబడులు రెట్టింపయ్యాయి. మొత్తంగా రూ.2.25 లక్షల నుండి రూ.2.50 లక్షల వరకూ పెట్టుబడి అయ్యింది. దీనికి కౌలు అదనం. ఎలాగోలా పంట చేతికొచ్చింది అనుకున్న సమయంలో తాజా పరిస్థితులు రైతుల ఆంశలపై నీరు చల్లేలా ఉన్నాయి.

ప్రస్తుతం మిర్చి దిగబుడి ఎకరాకు 15 క్వింటాళ్ల నుండి 22 క్వింటాళ్ల వరకు ఉంటుందని అంచన. ఇందులో 60 శాతం పంట కోసి కళ్లాల్లో ఆరబోసి ఉండగా 40 శాతం పంట కోతకు సిద్ధంగా ఉంది. ఈ నేపథ్యంలో వర్షం వస్తే మొక్కలకు ఉన్న పంట దెబ్బతింటుంది. కళ్లాల్లోని పంటను కాపాడుకోవాలన్నా పట్టాల కోసం రైతులు నానా తంటాలు పడాల్సిందే. గతంలో సబ్సిడీపై టార్పాలిన్ పట్టాలను వ్యవసాయ శాఖ ద్వారా ప్రభుత్వం రైతులకు అందించిన ప్రస్తుతం ఇవ్వడం లేదు. దీంతో ప్రైవేటుగా కొనుకోకవాలన్నా రైతులకు అధిక భారం అవుతోంది. 60-60 సైజు పట్టా గతంలో రూ.నాలుగైదు వేలకు వచ్చినా ప్రస్తుతం దీని ధర రూ.12 వేల వరకూ పలుకుతోంది. గేజ్ ఆధారంగా ఈ ధర ఇంకా ఎక్కువవుతోంది.

మరోవైపు అనుకోని పరిస్థితుల్లో పంట దెబ్బతింటే బాధిత రైతులకు వాతావరణ బీమా అందడం లేదు. సెప్టెంబర్‌లో మిర్చి మొక్క దశలో ఉండగా వర్షాల వల్ల అవి దెబ్బతిని రైతులు మళ్లీ నాటుకోవాల్సి వచ్చింది. కాపు, పూత దశలో ఉన్న పత్తి పైరు దెబ్బతిని రైతులు నష్టపోయారు. అయినా బీమా దక్కలేదు. ఈ పరిస్థితులన్నింటి నేపథ్యంలో పంట వర్షంబారిన పడకుండా ఉండడానికి రైతులు నానా తిప్పలు పడుతున్నారు.

పిడుగు పడి యువకాపరి దుర్మణం

సైదా మృతదేహం వద్ద విలపిస్తున్న కుటుంబీకులు

ఇద్దరికి గాయాలు - 69 జీవాలు మృత్యువాత

ప్రజాశక్తి - విజయపురిసౌత్, రెంటచింతల

పిడుగుపాటుతో జీవాల పెంపకందారుడైన యువకుడు, మరో 60కుపైగా జీవాలు మృత్యువాత పడ్డాయి. మాచర్ల, రెంటచింతల మండలాల్లో గురువారం చోటుచేసుకున్న ఘటనపై వివరాల ప్రకారం.. మాచర్ల మండలం నాగార్జునసాగర్ ఎయిర్ పోర్ట్ రూట్ పొలంలో చింతలతండాకు చెందిన రామావత్ సైదా (17) గొర్రెలను మేపుతున్నాడు. మధ్యాహ్నం రెండు గంటల తర్వాత ఒక్కసారిగా ఉరుములు మెరుపులతో కూడిన వర్షం వచ్చింది. దీంతో సదా తన గొర్రెలను సమీపంలోని చెట్టుకిందకు తొలుకెళ్లాడు. కొద్దిసేపటికి పిడుగుపడ్డంతో సైదా అక్కడికక్కడే మృతి చెందాడు. మరో 43 గొర్రెలు మృత్యువాత పడ్డాయి. సమీపంలోనే ఉన్న రమావత్ మనా తీవ్రంగా గాయపడ్డాడు.

మండల కేంద్రమైన రెంటచింతలలో గురువారం సాయంత్రం పిడుగు పడి 26 గొర్రెలు మృతి చెందాయి. గ్రామంలోని రేగులు మాన్యానికి చెందిన వీరబోయిన లింగయ్య తన గొర్రెలను ఎర్రకాలువ సమీపంలో మేపుతుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. మరో జీవాల పెంపకందారు గోపయ్యకు స్వల్ప గాయాలయ్యాయి. మృతి చెందిన గొర్రెల విలువ రూ.రెండు లక్షలుంటుందని లింగయ్య తెలిపాడు.

పల్నాడు డిఇఒగా శామ్యూల్

ప్రజాశక్తి - నరసరావుపేట

పల్నాడు జిల్లా నూతన విద్యాశాఖాధికారిగా కె.శామ్యూల్ నియమితులయ్యారు. ఈ మేరకు ఉత్తర్వులను రాష్ట్ర విద్యాశాఖ కార్యాలయం గురువారం విడుదల చేసింది. శామ్యూల్ ఇప్పటివరకు ఏపి మోడల్ స్కూల్ డైరెక్టర్‌గా విధులు నిర్వర్తించారు. ప్రస్తుతం పల్నాడు జిల్లా ఇన్‌ఛార్జి డిఇఒగా ఉన్న వెంకటేశ్వరరావు నుంచి త్వరలో భాధ్యతలు స్వీకరించనున్నారు.

కేంద్రీయ విద్యాలయం పనులకు కలెక్టర్ పరిశీలన

ప్రజాశక్తి-నాదెండ్ల

మండలంలోని ఇర్లపాడులో కేంద్రీయ విద్యాలయం నిర్మాణ పనులను పల్నాడు జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రహరీ, అప్రోచ్ రోడ్ల నిర్మాణానికి సంబంధించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మ్యాపులను పరిశీలించి సమస్యల పరిష్కారానికి అవసరమైన దస్త్రాలను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. పరిశీలనలో తహశీల్దార్ రమణ, ఎంపిడిఒ జాకీర్ హుస్సేన్, అవిసాయిపాలెం ఉపేంద్ర పాల్గొన్నారు.

యువతకు ఎస్ఎఫ్ఐ వాలీబాల్ కిట్

ప్రజాశక్తి-దాచేపల్లి

శారీరక, మానసిక దృఢత్వానికి క్రీడలు ఎంతో అవసరమని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) పల్నాడు జిల్లా అధ్యక్షులు కె.సాయికుమార్ అన్నారు. మండలంలోని పెదగార్లపాడుకు చెందిన యువకులకు వాలీబాల్ కిట్‌ను ఎస్ఎఫ్ఐ మండల కమిటీ ఆధర్యంలో గురువారం అందించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి విక్రం పాల్గొన్నారు.

20న అంగన్వాడీల మహాధర్నా

ప్రజాశక్తి - నరసరావుపేట

హామీల అమలు, సమస్యల పరిష్కారం కోసం విజయవాడలోని అలంకార్ సెంటర్లో ఈనెల 20న నిర్వహించే మహాధర్నాలో అంగన్వాడీలంతా పాల్గొనాలని అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి జి.మల్లేశ్వరి పిలుపునిచ్చారు. ఈ మేరకు ధర్నా పోస్టర్‌ను స్థానిక కోటప్పకొండ రోడ్డులోని పల్నాడు విజ్ఞాన కేంద్ర ప్రాంగణంలో గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మల్లేశ్వరి మాట్లాడుతూ యాప్‌ల వేధింపులతో అంగన్వాడీలు మానసిక ఆందోళనకు గురవుతున్నారని, మరోవైపు 3 నెలల నుండి వేతనాలు, సెంటర్‌ల అద్దెలు ఇవ్వకపోవడంతో అప్పుల పాలవుతున్నారని అన్నారు. ఇవి చాలవన్నట్లు రాజకీయ వేధింపులు ఎక్కువయ్యాయన్నారు. తెలంగాణ రాష్ట్రం కంటే అదనంగా రూ.వెయ్యి అదనంగా జీతం ఇస్తామని ఎన్నికల సందర్భంలో జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ ఏమైందని ప్రశ్నించారు. గ్రాడ్యుటీకి అంగన్వాడీలు అర్హులని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చినా ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని అన్నారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ కింద హెల్పర్‌కు రూ.20 వేలు , హెల్పర్‌లకు రూ.50 వేలు ఇచ్చి సరిపెడుతున్నారని ఆవేదన వెలిబుచ్చారు. ఈ సమస్యలపై అధికారులు, ప్రభుత్వం దృష్టికి ఎన్నిసార్లు తీసుకెళ్లినా స్పందించడం లేదని, ఈ నేపథ్యంలో బడ్జెట్ సమావేశాల సందర్భంగా అయినా సమస్యలు పరిష్కరించాలనే డిమాండ్‌తో మహాధర్నా చేపట్టామని చెప్పారు. కార్యక్రమంలో సిఐటియు పల్నాడు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కె.హనుమంతరెడ్డి, ఎస్.ఆంజనేయ నాయక్, శ్రామిక మహిళ సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ డి.శివకుమారి, యూనియన్ నరసరావుపేట ప్రాజెక్ట్ అధ్యక్షులు ఎం.కవిత, డి.విమల, ఫాతిమా, పాల్గొన్నారు.

రాజధాని గ్రామం అనంతవరంలో నిరసన

ఫిరంగిపురం ఆకలిపోరు దీక్షలో మాట్లాడుతున్న బి లక్ష్మణరావు

కార్మికుల ఆకలికేకలు పట్టని పాలకులు

ఫిరంగిపురంలో 4వ రోజు కొనసాగుతున్న ఆకలిపోరు దీక్ష - దీక్షలకు మద్దతుగా రాజధాని మందడం, అనంతవరంలో నిరసన తెలిపిన కార్మికులు

ప్రజాశక్తి - ఫిరంగిపురం

నెలల తరబడి బకాయి ఉన్న జీతాలు వెంటనే చెల్లించాలని, ఏ నెలకానెల జీతాలివ్వాలని, టెండరింగ్ విధానం రద్దు చేయాలని, గ్రీన్ అంబాసిడర్‌లకు రూ.10వేలు వేతనం ప్రభుత్వం ఇవ్వాలని, పెరిగిన ధరలకనుగుణంగా పంచాయతీ కార్మికులకు వేతనాలు పెంచాలని డిమాండ్ చేస్తు మండలంలోని గ్రామపంచాయతీ కార్మికులు చేస్తున్న ఆకలిపోరు దీక్ష 4వ రోజుకు చేరుకుంది.గురువారం దీక్షలో సిఐటియు జిల్లా కార్యదర్శి బి లక్ష్మణరావు కార్మికులకు మద్దతు తెలిపి ప్రసంగించారు. వైసిపి ఎన్నికల మేనిఫెస్టోలో ఉద్యోగులందరికీ రూ.10 వేలు తక్కువ లేకుండా జీతం చెల్లిస్తామని హామీ ఇచ్చిందని అధికారంలోకి వచ్చి నాలుగేళ్లు కావస్తున్నా గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించేందుకు ప్రభుత్వం ఏమాత్రం శ్రద్ధ చూపడం లేదని విమర్శించారు. మండలంలో ఉన్న 150 మంది కార్మికుల్లో 100 మంది పదివేల లోపు జీతం తీసుకుంటున్నారని, వీరికి కూడా 3 నుండి 8 నెలల పాటు జీతాలు బకాయి ఉన్నాయని ఇలా అయితే గ్రామపంచాయతీ కార్మికుల కుటుంబాలు ఎలా గడుస్తాయని ప్రశ్నించారు. గ్రీన్ అంబాసిడర్లకు ఇప్పటివరకు జీతాలు ఇచ్చిన కేంద్ర ప్రభుత్వం చేతులెత్తేసిందని గ్రామపంచాయతీలే వీరికి జీతాలు చెల్లించాలంటే గ్రామ పంచాయతీలు వీరి జీతాలు భరించే పరిస్థితి లేదన్నారు. వీరందరికీ రాష్ట్ర ప్రభుత్వమే పదివేలకు తక్కువ లేకుండా జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. సిఐటియు మండల కార్యదర్శి ఎస్‌కె మస్తాన్ వలి , గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్షులు సిహెచ్ రామారావు మాట్లాడుతూ గ్రామ ప్రజానీకానికి ఎంతో ముఖ్యమైన సేవలందిస్తున్న పంచాయతీ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని అనేకసార్లు అధికారులకు విజ్ఞప్తి చేసినా సమస్యలు పరిష్కారం కాలేదని గత్యంతరం లేక కార్మికులు పోరాటానికి దిగారన్నారు. మండలంలోని ప్రజానీకమంతా గ్రామపంచాయతీ కార్మికుల "ఆకలి పోరు" పోరాటానికి మద్దతు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. పోరాట శిబిరం నుండి నుండి ప్రదర్శన నిర్వహించారు. దీక్షలో రమణ జె. నాగేశ్వరరావు, సమ్మక్క, ఏసు కుమారి, మేరీ, గురవమ్మ, సుకన్య, పుల్లయ్య పాల్గొన్నారు. దీక్షలకు రైతు సంఘం నాయకులు సిహెచ్ వెంకటేశ్వర్లు, సిహెచ్ సాంబశివరావు సంఘీభావం తెలిపారు.

ఆకలిపోరు మద్దతుగా రాజధానిలో నిరసనలు

ప్రజాశక్తి - తుళ్లూరు

పెండింగ్ జీతాలు, తాము ఎదుర్కొంటున్న ఇతర సమస్యల పరిష్కారం కోసం, ఫిరంగిపురం మండల పారిశుధ్య కార్మికుల చేస్తున్న ఆకలి పోరుకు మద్దతుగా రాజధాని ప్రాంత పారిశుధ్య కార్మికుల నిరసనలు, ధర్నాలు కొనసాగుతున్నాయి. గురువారం మందడం పంచాయతీ కార్యాలయం వద్ద ధర్నా, అనంతవరంలో నిరసన తెలిపారు. ధర్నాలో రాజధాని ఏరియా పారిశుధ్య కార్మిక సంఘం గౌరవాధ్యక్షులు ఎం రవి మాట్లాడుతూ కార్మికుల పెండింగ్ జీతాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. జీతం రూ 15వేలు,మెడికల్ అలవెన్స్ రూ 6వేలు కలిపి రూ21వేలు ఇవ్వాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. తమ సమస్యలను యూనియన్ దృష్టికి తీసుకువెళుతున్నారనే ఊక్రోషంతో కార్మికులను ఇతర గ్రామాలకు పంపి ఎలాంటి రక్షణ చర్యలు చేపట్టకుండా ఎండలో మాడుస్తారా.. అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏ గ్రామాల కార్మికులను ఆ గ్రామాల్లోనే ఉంచి పని చేయించాలని,ె ఎండింగ్ పీఎఫ్, ఈఎస్ఐ కార్డులు ఇవ్వాలని, కార్మికులకు రక్షణ పరికరాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్మికుల పట్ల సిఆర్‌డిఎ అధికారులు కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారన్నారు. జీతాలు అడిగిన కార్మికులపై అధికారులు మండిపడుతున్నారని,ఇష్టముంటే చేయండి లేకపోతే పని మానేసి పోండని బెదిరింపులకు దిగుతున్నారని, ఇది ఏమాత్రం సరైనది కాదని అన్నారు.రోజురోజుకీ కార్మికులపై తీవ్రమైన వేధింపులకు దిగుతున్నారని, పొమ్మనకుండా కార్మికులకు పొగ పెడుతున్నారని అన్నారు. తక్షణం కార్మికులపై వేధింపులు ఆపకపోతే కార్మికుల కుటుంబ సభ్యులతో కలిసి ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

22న శ్రీ కామాక్షి ఎలక్ట్రానిక్స్ షోరూం ప్రారంభం

ప్రజాశక్తి-గుంటూరు :ఇంట్లో అవసరమైన అన్ని రకాల ఎలక్ట్రానిక్ వస్తువులను ప్రజలకు ఒకేచోట అందుబాటులో ఉంచేందుకు శ్రీ కామాక్షి ఎలక్ట్రానిక్స్ షోరూంను తెలుగు సంవత్సరాది అయిన ఉగాది రోజు ప్రారంభిస్తున్నట్లు ప్రొప్రైటర్ చల్లగుండ్ల శరణ్యకుమారి, నిర్వాహకులు చల్లగుండ్ల రామాంజనేయులు తెలిపారు. గుంటూరు నగరం గోరంట్ల ఇన్నర్ రింగురోడ్డులోని శ్రీదుర్గ దేవాలయం వద్ద ఆర్‌ఆర్ కాంప్లెక్స్‌లో ప్రారంభించే తమ షోరూంలో అన్ని కంపెనీల వాషింగ్‌మెషిన్లు, ఫ్రిజ్‌లు, ఏసీలు, స్మార్ట్‌ఫోన్‌లు, టీవీలు, హోమ్‌థియేటర్లు, ట్యాబ్‌లు, ల్యాప్‌టాప్‌లు, ప్రింటర్లు, ఇన్వర్టర్లు, ఫ్యాన్లు, కుక్కర్లు, మిక్సీలు, గ్యాస్‌స్టౌవ్‌లు, ఐరన్‌బాక్స్‌లు, మైక్రోవేవ్ వోవెన్‌లు, వాక్యుమ్ క్లీనర్లు, తదితర సమస్త ఎలక్ట్రానిక్ వస్తువులూ తమ వద్ద లభిస్తాయని చెప్పారు. అన్ని ప్రముఖ కంపెనీలకు చెందిన, నాణ్యమైన వస్తువులను అందుబాటు ధరల్లో లభిస్తాయని, ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని వారు కోరారు.

ఈ-పంట నమోదు వివరాలు సరిచూసుకోండి

ప్రజాశక్తి - తుళ్లూరు

జాబితాను చూపుతున్న వ్యవసాయ శాఖ సిబ్బంది

రైతులు ఈ - పంట నమోదులో వివరాలను సరిచూసుకోవాలని, తప్పులు ఉంటే గ్రామ వ్యవసాయ సహాయకుని దృష్టికి తీసుకువెళ్లి సరి చేయించు కోవాలని మండల వ్యవసాయధికారి కె శ్రీరంజని సూచించారు. బుధవారం సాయంత్రం పెదపరిమిలోని ఆర్‌బికెలో 2022 - 23 వ్యవసాయ సీజన్‌కు సంబంధించిన ఈ - క్రాప్ ముసాయిదా జాబితాను ఆమె పరిశీలించారు. అనంతరం రైతులతో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఒ మాట్లాడుతూ మండలంలోని పెదపరిమి1, 2, వడ్డమాను, హరిశ్చం ద్రపురం, రాయపూడి, మందడం, లింగాయపాలెం ఆర్‌బికెల్లో ఈ - క్రాప్ ముసాయిదా జాబితాలను ఉంచామని తెలిపారు. సామాజిక తనిఖీ నిమిత్తం ఈ నెల 9 వ తేదీ నుంచి 12 వరకు ఆర్‌బికెల్లో ఉంచామని, 17 వ తేదీ వరకు జాబితాల్లో ఈ - పంట నమోదులో తప్పులను గ్రామ వ్యవసాయ సహాయకుని ద్వారా సరిచేసుకునే వీలుందన్నారు.

నివాళులర్పిస్తున్న జెవి రాఘవులు, చంగయ్య తదితరులు

చిన్న సాంబయ్యకు ఘన నివాళి

ప్రజాశక్తి-మంగళగిరి

రోడ్డు ప్రమాదానికి గురై, విజయవాడలో చికిత్స పొందుతున్న మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ మంగళగిరి పట్టణ నాయకులు పి చిన్న సాంబయ్య (50) పరిస్థితి విషమించి బుధవారం రాత్రి మృతి చెందారు. మంగళగిరి కుప్పురావుకాలనీలో చిన్న సాంబయ్య స్వగృహంలో ఆయన భౌతికకాయానికి గురువారం సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎస్ఎస్ చెంగయ్య, నాయకులు జెవి రాఘవులు, వై కమలాకర్, టి శ్రీనివాసరావు, షేక్ జానీ భాష, పి రామచంద్రరావు తదితరులు పూలమాల వేసి నివాళు లర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. మృతుడు చిన్న సాంబయ్యకు భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు.

మున్సిపల్ కార్మికులతో మాట్లాడుతున్న బూరుగ వెంకటేశ్వర్లు

నేటి చలో కలెక్టరేట్‌ను జయప్రదం చేయండి

కొబ్బరినూనె, సబ్బులు వెంటనే ఇవ్వాలని నాయకుల డిమాండ్

ప్రజాశక్తి-తాడేపల్లి

తాడేపల్లి పట్టణంలో పని చేస్తున్న పారిశుధ్య కార్మికులకు ఎనిమిది నెలలుగా రావాల్సిన కొబ్బరినూనె, సబ్బులు, చెప్పులు వెంటనే ఇవ్వాలని మున్సిపల్ యూనియన్ అధ్యక్షులు బూరుగ వెంకటేశ్వర్లు సంబంధిత అధికారులను కోరారు. గురువారం కృష్ణనగర్‌లో జరిగిన మున్సిపల్ కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెల్లవారుజామున లేచి వెట్టిచాకిరీ చేస్తున్న మున్సిపల్ కార్మికులకు రక్షణ పరికరాలు అందించడంలో మున్సిపల్ అధికారులు విఫలమయ్యారని విమర్శించారు. 11 జులై 2022న జరిగిన సమ్మె సందర్భంగా ప్రభుత్వం ఇచ్చిన హామీలు నేటికీ అమలు చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. హామీలు బుట్టదాఖలు చేసిన ఈ ప్రభుత్వానికి కార్మికుల పట్ల చిత్తశుద్ధి ఏపాటిదో తెలుస్తుందన్నారు. ఇప్పటికైనా ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారానికి 17వ తేదీ శుక్రవారం చేపట్టిన చలో కలెక్టరేట్ కార్యక్రమానికి మున్సిపల్ కార్మికులు తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో కొండయ్య, తిమోన్, శాంత, అనూష, బాలయ్య, వలి, బాపూజీ, జి.మరియమ్మ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పౌష్టికాహారాన్ని అందజేస్తున్న రంగారావు తదితరులు

విద్యార్థులకు పౌష్టికాహారం అందజేత

ప్రజాశక్తి-పొన్నూరు రూరల్

పొన్నూరు పట్టణం నిడుబ్రోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు స్టడీ ఆవరణలో పౌష్టికాహారాన్ని అందించారు. కార్యక్రమంలో వ్యవసాయ సలహా మండలి బొద్దులూరి రంగారావు, తల్లిదండ్రులు కమిటీ చైర్ పర్సన్ షాహిదా, పాఠశాల హెచ్‌ఎం వసుంధర దేవి విద్యార్థులకు పౌష్టికాహారం అందజేశారు. ఈ సందర్భంగా హెచ్ ఎం మాట్లాడుతు జడ్‌పి నిధుల నుండి విద్యార్థులకు పౌష్టికాహారాన్ని అందజేస్తున్నామని తెలిపారు.

అమ్మమ్మగారి వంటింటిలోన రుచుల జ్ఞాపకం...

డబుల్‌హార్స్ మినపగుళ్లుపై వైరలవుతున్న చంద్రబోస్ సాహిత్యం

ప్రజాశక్తి-తెనాలి

డబుల్‌హార్స్ వ్యాపార ప్రకటన పాట రచించిన చంద్రబోస్

ఆర్‌ఆర్‌ఆర్ సినిమా ఇప్పుడు ఎక్కడ చూసినా ఇదే హాట్ టాపిక్. ఎందుకంటే సినీ ప్రపంచం జక్కన్నగా పిలుచుకునే దర్శకులు రాజమౌళి చేసిన వినూత్న ప్రయోగం ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. ఆర్‌ఆర్‌ఆర్ టీమ్ యావత్తూ ప్రపంచస్థాయిలో గర్వించే రీతిలో అన్ని విభాగాల్లోనూ అవార్డుల పంట పండించింది. ఆర్‌ఆర్‌ఆర్ విజయంలో భాగస్వామిగా ఉన్న సినీ గేయ రచయిత, ఆస్కార్ అవార్డును సొంతం చేసుకున్న అచ్చతెలుగు ఆణిముత్యం 'చంద్రబోస్' కలం డబుల్‌హార్స్ మినపగుళ్లలోని మాధుర్యాన్ని తన మాటల్లో పలికించారు. ఆంధ్రా ప్యారిస్ తెనాలి కేంద్రంగా జాతీయ, అంతర్జాతీయ మార్కెట్‌లో వ్యాపార రంగంలో విశేషాదరణ పొందిన డబుల్‌హార్స్ మినగుళ్ళు వ్యాపార ప్రకటనకు చంద్రబోస్ రచన డబుల్‌హార్స్ మినపగుళ్ళపై ఇలా సాగింది. ...

'అమ్మమ్మగారి వంటింటిలోన రుచుల జ్ఞాపకం...
ఆనాటి నుండి ఈనాటి దాకా మధుర జ్ఞాపకం..
అందులోన ఉందిలే ఆనందాల మంత్రం ..
ఆ వంటకాల నిండినే ఆరోగ్యాల సూత్రం ..
గుండె లోతుల్లోంచి జ్ఞాపకాలు అన్ని గుర్తుకొచ్చె నేడు
మన తెనాలి డబుల్ హార్స్ మినపగుళ్లు చూడు'

చంద్రబోస్ పదాల పొందిక పాటగా రూపాంతరం చెందిన తెనాలి డబుల్ హార్స్ మినపగుళ్ళు కనీ వినీ ఎరుగనిరీతిలో మహిళల ఆదరణను చూరగొంటుంది. డబుల్ హార్స్ మినపగుళ్లు అధినేత మునగాల మోహనశ్యామ్ ప్రసాద్ ఆర్‌ఆర్‌ఆర్ విజయంపై యావత్ టీమ్‌కు శుభాకాంక్షలు చెబుతున్నారు. ప్రత్యేకించి చంద్ర బోస్ సాహిత్యం సినిమాకే పరిమితం కాకుండా తమ వ్యాపార ప్రకటనకు విస్తరించటంపట్ల హర్షం వ్యక్తం చేశారు.

సమర్ధవంతంగా జగనన్న స్వచ్ఛ సంకల్పం అమలు

- చెత్తసేకరణ ద్వారా అభివృద్ధికి ఆదాయాన్ని పంచాయతీలే సమకూర్చుకోవాలి
- పల్నాడు జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ ఎల్.శివశంకర్ తదితరులు

ప్రజాశక్తి-నరసరావుపేట

జగనన్న స్వచ్ఛ సంకల్ప్ కార్యక్రమాలను పల్నాడు జిల్లాలో సమమర్ధవంతంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ ఎల్.శివశంకర్ అన్నారు. ఐటిసి - సెర్ఫ్ సంస్థ ఏర్పాటు చేసిన ఘన వ్యర్థాల నిర్వహణ స్టాల్స్‌ను కలెక్టరేట్‌లో గురువారం ప్రారంభించారు. ఐటిసి ద్వారా గ్రామాల్లో చేపట్టి కార్యక్రమాలు, స్టాల్స్ నిర్వహణ తీరును కలెక్టర్‌కు ఐటిసి ప్రోగ్రామం మేనేజర్ గౌరీ నాయుడు వివరించారు. ప్రస్తుతం ప్రభుత్వ భాగస్వామ్యంతో 40 గ్రామాల్లో స్వచ్ఛ సంకల్ప్ కార్యక్రమాలకు అవసరమైన పరికరాల పంపిణీతో పాటు మరిన్ని సామజిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ సందర్భంగా డాక్టర్ బిఆర్ అంబేద్కర్ స్పందన హాల్‌లో నిర్వహించిన శిక్షణలో కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి ఇంటికీ రెండు సెప్టిక్ ట్యాంక్‌లను తప్పని సరిగా ఏర్పాటు చేసుకోవాలని, వీటితో పాటు మురుగు నీటి పారుదలను సక్రమంగా ఉండేలా చర్యలు తీసుకుంటే ఆ నీటిని పెరటి తోటల పెంపకానికి ఉపయోగించుకోవచ్చని చెప్పారు. చెత్త సేకరణ ద్వారా గ్రామ పంచాయతీలు ఆదాయం పొందే మార్గాలు, ఇతర కార్యకలాపాలతో నిధులను సమకూర్చుకొని అభివృద్ధికి బాటలు వేసుకోవాలని సూచించారు. గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుదలకు ఐటిసి, సెర్ఫ్ సంస్థల అందిస్తున్న శిక్షణా కార్యక్రమాలను ఉపయోగించుకొని గ్రామాలను పరిశు భ్రంగా ఉంచుకోవాలని ఆదేశించారు. అన్ని గ్రామాల్లో స్వచ్ఛ సంకల్ప్ కార్యక్రమంపై శిక్షణ, అవగాహన కార్యక్రమాలు, కరపత్రాల ద్వారా ప్రచారం, విజ్ఞాన యాత్రల నిర్వహణ, పారిశుధ్యంపై ప్రజల్లో చైతన్యం పెంచడం తదితర కార్యమ్రకాలు చేస్తున్న ఐటిసి, సెర్ఫ్ సంస్థలను అభినందించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి వినాయకం, జిల్లా పంచాయతి అధికారి భాస్కర్‌రెడ్డి, రాష్ట్ర స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ కో-ఆర్డినేటర్ గోపాలకృష్ణ, పద్మాకర్, సురేష్, కృష్ణ, శ్రీనివాస్, మండలాల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పాఠశాలలో కలెక్టర్ బస

వెల్దుర్తి మండలం శిరిగిరిపాడులోని గిరిజన ఆశ్రమ పాఠశాలను కలెక్టర్ గురువారం సందర్శించారు. విద్యార్థినులతో మాట్లాడి పలు అంశాలపై సూచనలు చేశారు. అనంతరం జెడ్‌పి పాఠశాలలో బస చేశారు. శుక్రవారం ఉదయం 'గ్రామోదయం' కార్యక్రమాన్ని మండలంలోని గొట్లపాడులో నిర్వహిస్తారు. గ్రామాన్ని పరిశీలించి వివిధ సమస్యలపై అధికారులతో చర్చిస్తారు.

డ్రెయినేజీ కాల్వలను పరిశీలిస్తున్న చైర్మన్ తదితరులు

భవనాలను కూలిస్తే చెప్పండి..

ప్రజాశక్తి - చిలకలూరిపేట

స్థానిక 20 వార్డులోని వార్డులో పారిశుధ్యం, రహదార్లు, కల్వర్టులు, ముస్లిముల కబర్‌స్థాన్‌ను మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని గురువారం పరిశీలించారు. వివిధ సమస్యల పరిష్కారానికి సిబ్బందిని ఆదేశించారు. పాత భవనాలను కూల్చేవారు ఆ వ్యర్థాలను ఎక్కడంటే అక్కడ వేయొద్దని, మున్సిపల్, సచివాలయ సిబ్బందికి తెలపాలని, మున్సిపల్ సిబ్బంది వాటిని తరలిస్తారని కమిషనర్ సిహెచ్ గోవిందరావు కోరారు. లేకుంటే జరిమానా విధిస్తామన్నారు. ఇదిలా ఉండగా 25, 26 సచివాలయాలను కమిషనర్ సిహెచ్ గోవిందరావు తనిఖీ చేశారు. రికార్డులను పక్కాగా నిర్వహించాలని, లక్ష్యాలను పూర్తి చేయాలని చెప్పారు. అనంతరం సుగాలి కాలనీలోని మున్సిపల్ పాఠశాలను పరిశీలించారు. డిఇ రమణ, ఎఇ శ్రీనివాసరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, ఇస్మాయిల్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

'జగన్ పాలనలో మద్యం ఏరులు'

ప్రజాశక్తి - చిలకలూరిపేట

జగన్ పాలనలో మద్యం ఏరులై పారుతోందని, మద్యం కారణంగా మహిళలపై దాడులు మరింత పెరిగాయని తెలుగు మహిళ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జరీనా సుల్తానా అన్నారు. పట్టణంలోని 28వ వార్డు రాగన్నపాలెంలో మహిళలతో నిర్వహించిన 'మాటా-మంతి'లో ఆమె మాట్లాడుతూ జగన్ పాలన అంతం కోసం మహిళలు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు పి.లక్ష్మీ, షేక్ గౌస్యా, ఎ.అనిత భాయి, ఆర్.పద్మ, ఆర్.కేథారేశ్వరి, కరుణ కుమారి పాల్గొన్నారు.

డాక్టర్ వెంకట్రావుకు కళ్లజోళ్లను అందిస్తున్న రామకృష్ణ

ఏరియా వైద్యశాలకు కళ్లజోళ్లు వితరణ

ప్రజాశక్తి - సత్తెనపల్లి టౌన్

స్థానిక ఏరియా వైద్యశాలకు దాతలు సమకూర్చిన వస్తువులను వైద్యాధికారి డాక్టర్ వెంకట్రావుకు ఆస్పత్రి అభివృద్ధి కమిటీ డైరెక్టర్ కొత్త రామకృష్ణ గురువారం అందించారు. ఈ సంద్భంగా రామకృష్ణ మాట్లాడుతూ ఆస్పత్రికి కళ్లజోళ్లు కావాలని తన మిత్రుణ్ణి అడగగానే రూ.50 వేలతో సమకూర్చారని చెప్పారు. కార్యక్రమంలో డాక్టర్ లక్ష్మణ్, ఆర్ఎంఒ శోభారాణి, బయో మెడికల్ ఇంజినీర్ చంద్ర పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములుకు ఘన నివాళి

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా విలేకర్లు

చిలకలూరిపేటలో పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న వాసవి క్లబ్

పొట్టి శ్రీరాములు 122వ జయంతిని పురస్కరించుకొని పల్నాడు జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని బిఆర్ అంబేద్కర్ స్పందన సమావేశ మందిరంలో నివాళు లర్పించారు. పొట్టి శ్రీరాములు చిత్రపటానికి కలెక్టర్ ఎల్.శివశంకర్ పూలమాలలేశారు. డిఆర్ఒ వినాయకం, డిపిఒ భాస్కర్‌రెడ్డి, డిఆర్‌డిఎ పీడీ బాలునాయక్, జిల్లా హార్టికల్చర్ అధికారి బెన్నీ, డ్వామా పీడీ జోసఫ్ కుమార్, కలెక్టరేట్ ఏవో అనిల్‌కుమార్ పాల్గొన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి ఎస్పీ వై.రవిశంకర్‌రెడ్డి పూల మాల వేసి నివాళులర్పించారు. భాషా ప్రయుక్త రాష్ట్రాల అవకశ్యతను చాటిచెప్పిన గొప్పవ్యక్తి పొట్టి శ్రీరాములు అని, ఆశయ సాధన కోసం ప్రాణత్యాగం చేశారని కొనియాడారు. మహాత్మాగాంధీ బోధించిన సత్యం, అహింస, హరిజనోద్ధరణ తదితర ఆశయాల సాధన కోసం జీవితాంతం కృషి చేశారని చెప్పారు. ఇలాంటి వారు నేటి సమాజానికి చాలా అవసరమని చెప్పారు. కార్యక్రమంలో డీఎస్పీ విజయ భాస్కరరావు, ఎఆర్ డీఎస్పీ చిన్నికృష్ణ, సిఐలు భక్తవత్సలరెడ్డి, అశోక్‌కుమార్, ఆర్ఐ రవికిరణ్, ఎస్ఐలు పాల్గొన్నారు. చిలకలూరిపేట పట్టణంలోని ఎన్ఆర్‌టి సెంటర్‌లో ఉన్న పొట్టిశ్రీరాములు విగ్రహానికి మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని పూలమాలలేశారు. వాసవి క్లబ్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు. తహశీల్దార్ కార్యాలయంలో చిత్రపటానికి తహశీల్దార్ జి.సుజాత పూలమాలలేశారు. దాచేపల్లిలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో నివాళులర్పించగా వైసిపి వాణిజ్య విభాగం నాయకులు మాశెట్టి బుజ్జి మాట్లాడారు. డి.రమేష్, ఎ.సుబ్బారావు, డి.కొండలు పాల్గొన్నారు. సత్తెనపల్లిలోని టిడిపి కార్యాలయంలో నివాళులర్పించగా ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు సయ్యద్ పెదకరిముల్లా మాట్లాడారు. ఎన్.పాపారావు, ఎ.నాగేశ్వరావు, బుడే, పి.నరసింహారావు, బి.నాగరాజు, ముస్తఫా, మీరాసాహెబ్ పాల్గొన్నారు. మండల కేంద్రమైన రొంపిచర్లలోని జెడ్‌పి పాఠశాలలో చిత్రటపానికి హెచ్ఎం షేక్ మొహిద్దీన్ సాహెబ్ పూలమాలలేసి నివాళులుర్పించారు. మాజీ సర్పంచ్ పడాల చక్రారెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. మాచర్ల పార్క్ సెంటర్, శ్రీ కోదండ రామాలయం ఆవరణలో, తహశీల్దార్ కార్యాలయం వద్ద పొట్టి శ్రీరాములు విగ్రహం, చిత్రపటాలకు ఆర్యవైశ్య సంఘం, ఆవోపా, మహిళా సంఘం, వైసిపి నాయకులు వేర్వేరుగా నివాళు లర్పించారు. జడ్‌పిటిసి మల్లుస్వామి, మున్సిపల్ చైర్మన్ బి.రఘురామిరెడ్డి, వైస్‌చైర్మన్ పి.నరసింహరావు, కౌన్సిలర్ పోలా శ్రీనివాసరావు, ఏసోబు, సంతోష్, మార్కెట్ యార్డు డైరక్టర్ జి.బాలజనార్ధన్, కె.పాండురంగారావు పాల్గొన్నారు.

వక్ఫ్‌బోర్డు డైరెక్టర్‌గా కాశీం షరీఫ్

ప్రజాశక్తి-పెదకూరపాడు : వక్ఫ్ బోర్డు డైరెక్టర్‌గా రిటైర్డ్ హెచ్ఎం, లగడపాడు మాజీ సర్పంచ్ షేక్ కాశీం షరీఫ్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయనకు వైసిపి నాయకులు బి.కోటేశ్వరరావు, సొసైటీ డైరెక్టర్ బత్తుల రాజేంద్ర శుభాకాంక్షలు తెలిపారు. తన నియామకానికి సహకరించిన ఎమ్మెల్యే నంబూరు శంకరరావకు కాశీం షరీఫ్ కృతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థినులకు రక్త పరీక్షలు

ప్రజాశక్తి - చిలకలూరిపేట : పసుమర్రులోని శ్రీ మద్ది కామయ్య జెడ్‌పి పాఠశాలలో 70 మంది విద్యార్థినులకు సచివాలయ హెల్త్ అసిస్టెంట్ షేక్ రిజ్వానా, ఎఎన్ఎం పద్మావతి ఆధ్వర్యంలో గురువారం రక్తపరీక్షలు చేశారు. రక్తహీనత నివారణకు ఆకుకూరలు, బెల్లం, చిక్కీలు, కోడిగుడ్లు తదితర పౌష్టికాహారం తీసుకోవాలని హెచ్ఎం షేక్ మెహమ్మద్ యాసిన్ సూచించారు.

అక్రమ క్వారీయింగ్ వల్ల 8 మంది చిన్నారులు మృతి : యరపతినేని

ప్రజాశక్తి-దాచేపల్లి

మండలంలోని కాట్రపాడులో టిడిపి ఆధ్వర్యంలో 'ఇందే ఖర్మ' కార్యమ్రకం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు మాట్లాడుతూ గురజాల నియోజకవర్గంలో 9 మంది టిడిపి నాయకులను హత్య చేశారని, వైసిపి నాయకుల అక్రమ క్వారీయింగ్ వల్ల ఆ గుంతల్లో పడి 8 మంది చిన్నారులు మృత్యువాత పడ్డారని విమర్శించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలు, మైనార్టీలు, మహిళలపై వైసిపి పాలనలో దాడులు జరుగుతున్నాయని, అక్రమ కేసులు బనాయిస్తున్నారని మండిపడ్డారు. టిడిపికి చెందిన వారి ఆస్తులను ధ్వంసం చేస్తున్నారని, వీటన్నిటికీ వ్యతిరేకంగా వైసిపి ప్రజలు బుద్ధి చెబుతారని అన్నారు.

మహారాజశ్రీ అడిషనల్ సీనియర్ సివిల్‌జడ్జి వారి కోర్టులో నరసరావుపేట
ఐ.పి.నెం. 43/2019

బిట్వీన్ :
గుంటుపల్లి అనిల్‌కుమార్ ... పిటీషనర్
ఎదిరి
గుమ్మ శ్రీకాంత్‌రెడ్డి మరికొందరు ... రెస్పాండెంట్స్
టు :
R3 : గుంటకల రాము, తండ్రి : వెంకటేశ్వర్లు, డోర్ నెం. 29-23-9బి, సీతయ్యనగర్, వినుకొండ టౌన్, పల్నాడు జిల్లా.

సదరు పై నెంబరు ఐ.పి.లోని పిటీషనర్ తనను ఇన్సాల్‌వెంట్‌గా ప్రకటించమని, ఇందలి రెస్పాండెంట్స్ పై ఐ.పి. దాఖలు చేసియున్నాడు. సదరు ఐ.పి.లో 3వ రెస్పాండెంట్‌కు శ్రీ కోర్టు ద్వారా ఎన్నిసార్లు నోటీసులు పంపినను తీసుకొనక కాలయాపన చేయుచున్నందున శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం పేపరు ప్రకటన నోటీసు నిమిత్తం ది. 31-03-2023వ తేదీన పై కోర్టువారి ఎదుట 10-30 గం.లకు మీరు స్వయంగా గాని, ప్లీడరుగారి ద్వారా గాని హాజరై మీకు గల ఆక్షేపణలు వున్న యెడల తెలుపుకొన వలెను. లేనియెడల మీ పరోక్షమందు విచారించి తీర్మానించ బడును.

(కోర్టువారి అనుమతితో)

గంధం వెంకటేశ్వర్లు,
పిటీషనర్ తరపు అడ్వకేటు,
వినుకొండ.
చంద్ర రాజేశ్వరరావు
అడ్వకేట్, నరసరావుపేట.

పొట్టి శ్రీరాములుకు ఘన నివాళి

ప్రజాశక్తి- గుంటూరు జిల్లా విలేకరులు

అమరజీవి పొట్టి శ్రీరాములు 123వ జయంతిని పురస్కరించుకొని గురువారం కలెక్టరేట్‌లో ఆయన చిత్రపటానికి జిల్లా కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి, సంయుక్త కలెక్టర్ జి. రాజకుమారి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఎం. వేణుగోపాల్ రెడ్డి మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్రం కోసం 56 రోజులు నిరాహార దీక్ష చేసి, ప్రాణత్యాగం చేసిన పొట్టి శ్రీరాములు జీవితం యువతకు స్ఫూర్తిదాయకమన్నారు. కార్యక్రమంలో డిఆర్ఓ చంద్రశేఖరరావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ యం. వెంకట శివరామిరెడ్డి, ఆర్డీఓ ప్రభాకర్ రెడ్డి, డీఆర్డీఏ పీడీ హరిహరనాథ్, డియం అండ్ హెచ్ఓ డాక్టర్‌శ్రావణ్‌బాబు, జిల్లా వ్యవసాయ అధికారి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు. పొట్టి శ్రీరాములు జయంతిని పురస్కరించుకొని జిఎంసి ప్రధాన కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలు వద్ద నిర్వహించిన కార్యక్రమంలో నగర మేయర్ కావటి శివనాగమనోహర్‌నాయుడు, డిప్యూటి మేయర్లు వనమా బాలవజ్రబాబు, షేక్.సజీలా, అదనపు కమిషనర్ పెద్దిరోజా, డిప్యూటీ కమిషనర్లు బి.శ్రీనివాసరావు, టి. వెంకట కృష్ణయ్య, సిటి ప్లానర్ మూర్తి తదితరులు నివాళులర్పించారు. తెనాలి పుర పాలక సంఘ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ ఎం. జస్వంతరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో నివాళులరిర్పిం చారు. మున్సిపల్ చైర్‌పర్సన్ సయ్యద్ ఖలేదానశీం ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. పెదనంది పాడులోని నాగులపాడు ఆర్యవైశ్య కళ్యాణ మండపం వద్ద ఉన్న పొట్టి శ్రీరాములు విగ్రహానికి మండల వైఎస్ఆర్ సోషల్ మీడియా కన్వీనర్ చీమకుర్తి లోకేష్ పొన్నూరులోని తహశీల్దార్ కార్యా లయంలో, ఎంటిఎంసి పరిధిలోని తహశీల్దార్ కార్యాలయంలో, మంగళగిరి కార్పొరేషన్ కార్యాలయంలో,మంగళగిరి ఏపీఎస్పీ ఆరో బెటాలియన్‌లో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసినివాళులర్పించారు. మంగళగిరి మెయిన్ బజార్‌లోని పొట్టి శ్రీరాములు విగ్రహానికి వైసిపి ఆధ్వర్యంలో, జనసేన పార్టీ కార్యాలయంలో నివాళులర్పించారు.

పొట్టిశ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ , జాయింట్ కలెక్టర్ తదితరులు

విద్యుత్ వినియోగదారుల అదాలత్
43 సమస్యలకు పరిష్కారం

ప్రజాశక్తి- మేడికొండూరు

.మండల పరిధిలోని డోకిపర్రు సబ్ స్టేషన్లో గురువారం విద్యుత్ అధికారులు జిల్లాలోని నాలుగు మండలాలకు విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విశ్రాంత న్యాయమూర్తి ఎన్ విక్టర్ ఇమ్మానుయేల్ హాజరయ్యారు.కార్యక్రమంలో భాగంగా ఇమ్మానుయేల్ మాట్లాడుతూ ప్రజలు విద్యుత్ సమస్యలను పరిష్కరించుకోవడంలో ముందంజలో ఉండి విద్యుత్ సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించుకుంటూ అధికారులకు సహకరించాలని ప్రజలను కోరారు. డివిజన్‌లోని 8 మండలాల నుండి వచ్చిన విద్యుత్ వినియోగదారులు 43 ఫిర్యాదులు ఇవ్వగా వాటిలో 42 పరిష్కరించారు మరొక ఫిర్యాదుని క్షేత్రస్థాయిలో అధికారులు పరిశీలించి పరిష్కరించాలని ఆదేశించారు.

తూ తూ మంత్రంగా పరిష్కార వేదిక

డోకిపర్రులో నిర్వహించిన విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక తూతూ మంత్రంగా సాగిందని ప్రజలు పలువురు అభిప్రాయపడ్డారు. ఎన్నో ఏళ్లుగా పరిష్కారం కానీ అదనపు రీడింగ్‌లు వచ్చిన ప్రజలకు సమస్య పరిష్కారం అవుతుందనే ఆశతో వచ్చిన ప్రజలు నిరాశతో వెనుదిరిగారు. 2014 నుండి పలువురు అధికారులను కలిసిన తమ సమస్యలు పరిష్కారం కాలేదని విశ్రాంత న్యాయమూర్తి ఆధ్వర్యంలో సమస్యలు పరిష్కరించుకోవడం కోసం గురువారం పలు గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో వచ్చారు. కానీ ఈ వేదిక ద్వారా మాత్రం సమస్యలు పరిష్కారం అవడం లేదని పలువురు వాపోయారు.

విద్యుత్ సమస్యలు పరిష్కరించడంలో విశ్రాంత న్యాయమూర్తి తొలుత అర్జీని పరిశీలించి తదుపరి సంబంధిత అధికారికి ఆ అర్జీని పంపించగా అక్కడ విధులు నిర్వహిస్తున్న విద్యుత్ రెవెన్యూ అధికా మాత్రం కనీసం స్పందించడం లేదని పలువురు వినియోగదారులు ఆరోపించారు. ఇకనైనా పై ఉన్నత విద్యుత్ విశాఖ జిల్లా అధికారులు మండలంలోని పలు గ్రామాల్లో ఉన్న విద్యుత్ రీడింగ్,అధిక బిల్లు సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి ప్రజలకు న్యాయం చేయాలని పలువురు కోరారు. కార్యక్రమంలో డివిజన్ పరిధిలోని మేడికొండూరు, ఫిరంగిపురం, ప్రత్తిపాడు, వట్టి చెరుకూరు, చిలకలూరిపేట, నాదెండ్ల, యడ్లపాడు మండ లాల విద్యుత్ , వినియోగదారులు, ఇంజనీర్ చల్లా రమేష్, ఎస్ సి విజయ కుమార్ , డి.మల్లికార్జునరావు, సాంకేతిక సభ్యులు కె. వెంకట కృష్ణ, ఆర్థిక సభ్యులు ఎ.రామ్ దాస్,స్వతంత్ర సభ్యులు ఎ.సునీత పాల్గొన్నారు.

యుటిఎఫ్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ వారోత్సవాలు

ప్రజాశక్తి-పొన్నూరు రూరల్

ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ రాష్ట్ర సంఘం పిలుపుమేరకు పొన్నూరు ప్రాంతీయ శాఖల ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ వారోత్సవాలు గురువారం స్థానిక యుటిఎఫ్ కార్యాలయంలో ఘనంగా జరిగాయి. జిల్లా కార్యదర్శి డి.సాయికృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర యుటిఎఫ్ ప్రచురణ కమిటీ చైర్మన్ ఎం.హనుమంతరావు మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో పురుషులకు దీటుగా రాణిస్తున్నారన్నారు. మహిళా సాధికారత సాధించే దిశగా అడుగులు వేయాలన్నారు. మరో ముఖ్య అతిథి సీనియర్ నాయకులు కె.విజయభాస్కర్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా రిజర్వేషన్ సాధించినప్పుడే పూర్తి స్థాయిలో మహిళల అభ్యున్నతి సాధ్యమవుతుందని అన్నారు. యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షురాలు ఎఎల్ శివ పార్వతి మాట్లాడుతూ మహిళలు పురుషులతో సమానంగా అన్ని రంగాలలో అభ్యున్నతి సాధిస్తున్నారని, అయితే, ఆ దిశగా గ్రామీణ ప్రాంతాల్లో మరింత మెరుగైన ప్రోత్సాహం లభించడం లేదని చెప్పారు. జిల్లా కార్యదర్శి ఎండి షకీలా బేగం మాట్లాడుతూ ఆర్థిక రాజకీయ సామాజిక సాధికారిత సాధించినప్పుడే మహిళలు పూర్తిస్థాయిలో అభ్యున్నతి సాధించ గలరని అన్నారు. ఈ సందర్భంగా పొన్నూరు పట్టణ, మండలంలోని ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సిపిఎం బాధ్యులు ప్రభుదాసు, సిఐటియు బాధ్యులు రమేష్, మున్నూరు పట్టణ మండల, కాకుమాను మండలాల బాధ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

యుటిఎఫ్ నాయకుడు శ్రీనివాస్‌కు నివాళి

ప్రజాశక్తి-పొన్నూరు రూరల్

పొన్నూరు యుటిఎఫ్ సీనియర్ నాయకుడు గరికపాటి శ్రీనివాస్ సంస్మరణ సభ గురువారం స్థానిక యుటి ఎఫ్ కార్యాలయంలో ఘనంగా జరిగింది. యుటిఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు పివి శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. శ్రీనివాస్ చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం పలువురు వక్తలు మాట్లాడుతూ పొన్నూరు ప్రాంతంలో యుటిఎఫ్ నిర్మాణం, పటిష్టతకు శ్రీనివాస్ ఎంతో కృషి చేశారని, ఉద్యమ పోరాట పటిమ కలిగిన వ్యక్తి అని కొనియాడారు. యుటిఎఫ్ కు ఆయన చేసిన సేవలు మరువరానివన్నారు. సంస్మరణ సభలో యుటిఎఫ్ రాష్ట్ర ప్రచార కమిటీ చైర్మన్ ఎం హనుమంతరావు, జిల్లా కార్యదర్శి ఎండి షకీలా బేగం, జిల్లా కార్యదర్శి డి సాయికృష్ణ, సిపిఎం బాధ్యులు ప్రభుదాసు, సిఐటియు బాధ్యులు రమేష్, పొన్నూరు పట్టణ మండల కాకుమాను నరాల బాధ్యులు కార్య కర్తలు సీనియర్ సహచరులు , గరికిపాటి శ్రీనివాస్ కుమారుడు నరేంద్రదేవ్, కుమార్తె ప్రత్యూష, మనుమ రాళ్ళు, కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

నీటి వనరుల రక్షణకు అమృత్ సరోవర్ చెరువులు

ప్రజాశక్తి-దుగ్గిరాల

నీటి వనరుల రక్షణకు అమృత్ సరోవర్ చెరువులు దోహదపడ తాయని కేంద్ర కమిటీ సభ్యులు ధర్మవీర్ ఝ తెలిపారు. ఆగస్టు 15 ,2023 నాటికి దేశ వ్యాప్తంగా 50 వేల చెరువులు నిర్మించడం లేదా పునరుద్ధరించడం జరగనున్నట్లు తెలిపారు. మండలంలోని చిలు వూరులో చేపట్టిన అమృత్ సరోవర్ చెరువు పనులను గురువారం ఆయన పరిశీలించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి హామీ నిధులు ,15వ ఆర్థిక సంఘం నిధులతో ఈ కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు తెలిపారు. తాగునీటితో పాటు వ్యవసాయానికి చేపల పెంపకానికి ఇతర కార్యకలాపాలకు వినియోగించుకోవచ్చని చెప్పారు. అనంతరం చెరువు గట్లపై చెట్లను నాటారు. మండలంలోని చిలువూరు, చుక్కపల్లి వారిపాలెం, చింతలపూడి గ్రామాల్లో ఈ పనులు చేపట్టినట్లు ఎంపిడిఒ కుసుమ శ్రీదేవి తెలిపారు. ఇంకా రెండు గ్రామాలలో చేపడతా రన్నారు. కార్యక్రమంలో నీటి యాజమాన్య సంస్థ డైరెక్టర్ యుగంధర్, సిఆర్‌డి నుండి లాజరస్, ఎన్ఆర్ఈజీఎస్‌కు చెందిన మధుబాల సర్పంచ్ చిలువూరు మాణిక్యం పాల్గొన్నారు.

సెక్యూరిటీ గార్డుల తొలగింపు అన్యాయం

ప్రజాశక్తి-మంగళగిరి

ఎయిమ్స్ లో తొలగించిన 71 మంది సెక్యూరిటీ గార్డులను వెంటనే పనిలోకి తీసుకోవాలని కోరుతూ సిఐటియు, ఎయిమ్స్ సెక్యూరిటీ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం మంగళగిరిలో కరపత్రాలను పంపిణీ చేశారు. సెక్యూరిటీ గార్డులను తొలగించడం అన్యాయమని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎస్ఎస్ చెంగయ్య అన్నారు. కేంద్రంలోని బిజెపి పభుత్వ విధానం వలన సెక్యూరిటీ గార్డులను అన్యాయంగా తొలగించారని అన్నారు. వారిని వెంటనే పనిలో తీసుకోవాలని ఆందోళన చేస్తున్న వారికి ప్రజల మద్దతు ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా స్థానిక మెయిన్‌బజార్, గౌతమ్ బుద్ధ రోడ్ తదితర ప్రాంతాల్లో కరపత్రాలు పంపిణీ చేశారు. సిఐటియు పట్టణ కార్యదర్శి వై కమలాకర్, నాయకులు టి.శ్రీరాములు, ఎం.బాలాజీ, సెక్యూరిటీ యూనియన్ నాయకులు కె.వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

సిఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి-పొన్నూరు రూరల్

పొన్నూరు నియోజకవర్గ సిఎం ఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణి కార్యక్రమం గురువారం జరిగింది. పొన్నూరు ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య చేతుల మీదుగా గుంటూరు పార్టీ కార్యాలయంలో వారికి చెక్కులు అందజేశారు. మూడు లక్షల రూపాయలు చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు.

పన్నులు చెల్లించని వారికి నోటీసులు

ప్రజాశక్తి - తుళ్లూరు

ఇంటి పన్ను వసూళ్లను వేగవంతం చేయాలని, నిర్ధేశిత గడువులోగా వంద శాతం పన్నుల వసూలు లక్ష్యాన్ని పూర్తిచేయాలని డిఎల్‌పిఒ లక్ష్మణరావు చెప్పారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం మీటింగ్ హాలులో పంచాయతీ కార్యదర్శులు,వసూలు సిబ్బందితో సమావేశం నిర్వహించారు. డిఎల్‌పిఒ మాట్లాడుతూ, కార్యదర్శులు, వసూలు సిబ్బంది బృందాలుగా ఏర్పడి ఇంటి పన్ను బకాయిల వసూలుకు కృషి చేయాలన్నారు. మూడేళ్ల పైబడి పన్నులు చెల్లించని వారికి నోటీసులు ఇవ్వాలని,అవసరమైతే న్యాయపరమైన చర్యలు తీసుకోవాలని అన్నారు. సచివాలయం ,సీనియర్ పంచాయతి కార్యదర్శులు తప్పనిసరిగా యూనిఫాం ధరించాలన్నారు హైకోర్టు మార్గంలో కుక్కల బెడద అధికంగా ఉందని ఫిర్యాదులు వచ్చాయని, తగుచర్యలు తీసుకోవాలన్నారు .స్పందన కార్యక్రమంలో ప్రజల నుంచి వస్తున్న వినతులను పరిశీలించి సంతృప్తికరమైన పరిష్కారాన్ని చూపాలన్నారు. ప్రస్తుత వేసవికాలంలో గ్రామాల్లో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. ట్యాంకర్ల ద్వారా తాగునీరు తరలించాల్సిన పరిస్థితి ఉంటే తక్షణమే ఆ దిశగా చర్యలు చేపట్టాలన్నారు

అంకెల గారడీ బడ్జెట్

ప్రజాశక్తి-గుంటూరు

రాష్ట్ర ప్రభుత్వం రూ.2.79 లక్షల కోట్లతో ప్రవేశ పెట్టిన బడ్జెట్ అంకెల గారడీగా ఉందని రాజకీయ పార్టీలు పేర్కొన్నాయి. గురువారం రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై పలు పార్టీలు స్పందించాయి. వ్యవసాయ రంగానికి, సాగునీటి ప్రాజెక్టులకు, గ్రామీణ ప్రాంత అభివృద్ధికి గతం కంటే నిధులు తగ్గించారని విమర్శించారు. ముఖ్యంగా రాజధాని నిర్మాణానికి నిధులు కేటాయించకపోవటం అన్యాయమన్నారు.

పేపర్ బడ్జెట్

కాంగ్రెస్ పిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్, మస్తాన్‌వలి

రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్ పూర్తిగా ప్రజల్ని మోసం చేసేదిగా ఉంది. గతేడాది బడ్జెట్‌లో ఎంత ఖర్చు చేశారో ప్రకటించలేదు. కేటాయింపులు కాగితాలకే పరిమితం అయ్యాయి. ఆచరణలో ప్రభుత్వం వైఫల్యం చెందింది. ప్రజల్ని మోసం చేయటానికి అంకెల గారడీ చేశారు. గతేడాది రైతులు మూడు తుపాన్లు ఎదుర్కొన్నారు.వాటి తాలూకు రైతులకు ఇవ్వాల్సిన పంట నష్టప పరిహారం, రుణాల రద్దు, తక్షణ సాయం కూడా అందలేదు. జాబ్ క్యాలెండర్ అని ప్రకటించి, నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు ఇవకుండా వారినీ మోసం చేశారు. పూర్తిగా ఆంధ్రరాష్ట్ర ప్రజల వ్యతిరేక బడ్జెట్ అని కాంగ్రెస్ భావిస్తుంది.

పల్నాడు జిల్లాకు మరోసారి మోసం

సిపియం పల్నాడు జిల్లా కార్యదర్శి జి.విజయ్‌కుమార్

రాష్ట్ర ప్రభుత్వం రవీంద్రనాథ్ ఠాగూర్, అబ్దుల్ కలాం వంటి మేధావుల సూక్తులను చెబుతూ మరోసారి పల్నాడు జిల్లా ప్రజలను మరోసారి మోసం చేసింది. గత సంవత్సరం వరికపూ డిశెల నిర్మాణానికి నిధులు కేటాయిం చింది. పనులు ప్రారంభించలేదు. ఈ సంవత్సరం నిరుద్యోగులకు ప్రకటించాల్సిన జాబ్ క్యాలెండర్ ప్రకటించలేదు. ప్రభుత్వం నిరుద్యోగులకు ఎటువంటి చేయూత ఇవ్వలేదు. ఆర్భాటంగా పరిశ్రమలు వస్తున్నాయని, ఆరు లక్షల ఉపాధి అవకాశాలు దొరుకుతాయని, నమ్మించటానికి ప్రయత్నం చేస్తుంది. వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి నిధులు కేటాయించలేదు. రైతుల్ని ఆదుకోవటానికి ఎటువంటి చర్యలూ తీసుకోకుండా, సంక్షేమ పథకాలు సర్వస్వం అన్నట్లుగా బడ్జెట్‌లో కనిపిస్తున్నాయి. ప్రభుత్వం ఆలోచించి, పరిష్కారానికి నిధులు కేటాయించాలి.

అసత్యాలకు కొనసాగింపు బడ్జెట్

సిపిఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్

రాష్ట్ర ప్రభుత్వం 2.79 లక్షల కోట్లతో ప్రవేశపెట్టిన బడ్జెట్ గత నాలుగేళ్లుగా ప్రభుత్వం చెబుతున్న అసత్యాలకు కొనసాగింపుగానే ఉంది. ప్రతి ఏటా పేరుకే లక్షల కోట్ల బడ్జెట్ కేటాయిస్తూ, వాస్తవానికి నాలుగో వంతు కూడా ఖర్చుపెట్టకుండా ప్రజల్నిం మోసం చేస్తున్నారు. ఇంత భారీ బడ్జెట్ ప్రవేశపెట్టిన ప్రభుత్వం ఉద్యోగులకు ప్రతినెలా 1వ తేదీన జీతాలు ఎందుకు ఇవ్వలేకపోతుంది. నీటి వనరుల అభివృద్ధికి కేవలం 5శాతమే కేటాయించారు. గత నాలుగేళ్లలో పోలవరం సహా ఏ ఒక్క ప్రాజెక్ట్ అయినా కనీసం ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. 6.81 లక్షల ఉద్యోగాలు కల్పించినట్లు ప్రకటించటం అతిపెద్ద అబద్ధం. వాలంటీర్లు తప్ప రాష్ట్రంలో ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వలేదు. ఈ బడ్జెట్ అంకెల గారడీనే.

అభివృద్ధి రహిత బడ్జెట్

సిపియం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు

రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన వార్షిక బడ్జెట్ రాష్ట్ర అభివృద్ధికి దోహదపడే విధంగా లేదు. అంకెల గారడీతో కూడుకున్న బడ్జెట్. రాజధాని నిర్మాణానికి నిధులు కేటాయింపుల ఊసే లేదు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ కాకుండా తగు చర్యల ప్రస్తావన లేదు. బడ్జెట్లో రాష్ట్రంలోని యువతకు ఉపాధి కల్పించే చర్యలు చేపట్టలేదు. కీలకమైన వ్యవసాయ రంగానికి, సాగునీటి ప్రాజెక్టులకు గత బడ్జెట్ కంటే నిధులు కేటాయింపు తగ్గించారు. విద్య, వైద్యం, గ్రామీణాభివృద్ధి, పట్టణాల అభివృద్ధికి నిధులు కేటాయింపు సరిగా లేదు. నవరత్నాల కొనసాగింపునకు మాత్రమే ప్రాధాన్యత ఇస్తూ కొత్త పథకాల ఊసే ఎత్తలేదు. రాష్ట్రంలో లక్షలాదిగా ఉన్న కౌలు రైతుల రుణాలకు ఆటంకంగా వున్న చట్టాన్ని మార్చే ప్రతిపాదన చేయలేదు. మొత్తంగా అంకెల గారడీ తప్ప రాష్ట్ర అభివృద్ధి ఊసేలేని బడ్జెట్.

వ్యవసాయ రంగానికి నిధుల కుదింపు

కంచుమాటి అజయ్‌కుమార్, రైతు సంఘం గుంటూరు జిల్లా కార్యదర్శి

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ వ్యవసాయ రంగానికి ఏమాత్రం ఉపయోగపడదు. గతం కంటే బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి రూ.2వేల కోట్లు తగ్గించారు. 62 శాతం ప్రజలు ఆధారపడిన ఈ రంగానికి కేటాయింపులు పెంచాల్సిందిపోయి తగ్గించటం అన్యాయం. వైఎస్ఆర్ పియం బీమా యోజనకు గత బడ్జెట్‌లో రూ.1802 కోట్లు కేటాయించి, ప్రస్తుత బడ్జెట్‌లో రూ.1600 కోట్లు కుదించారు. గ్రామీణాభివృద్ధికి గతంలో రూ.17,109 కోట్లు కేటాయించగా, ఈసారి 15,873 కోట్లే కేటాయించారు. పంటరుణాల జీరో వడ్డీ పథకానికి రూ.2500 కోట్లు అవసరం కాగా బడ్జెట్‌లో రూ.500 కోట్లే కేటాయించారు.కౌలు రైతుల రుణాలకు అవరోధంగా ఉన్న ప్రభుత్వ జిఒకు ప్రత్యామ్నాయంగా ఎలాంటి మార్గాలు చూపలేదు.

కేటాయింపులు ఘనం..ఖర్చు అధ్వానం

తెనాలి శ్రావణ కుమార్, టిడిపి జిల్లా అధ్యక్షులు



గత నాలుగు బడ్జెట్లలో వ్యవసాయ, సాగునీటి, విద్య, వైద్యరంగాలకు కేటాయించిన నిధుల్నే జగన్ ప్రభుత్వ సక్రమంగా ఖర్చుచేయలేదు. కేంద్రప్రభుత్వం 90శాతం రాయితీఇచ్చే పథకాలకు కూడా 10శాతం నిధులు కేటాయించలేక చేతులెత్తేశారు. బడ్జెట్‌లో కేటాయింపులకు, ఖర్చులకు ఎక్కడా పొంతనలేదు. రాజధాని అమరావతిని పూర్తిగా విస్మరించారు. అమరావతి పేరు కూడా ప్రస్తావనకు నోచుకోలేదు.

నేటి నుంచి విజ్ఞాన్‌లో 'సృజనాంకుర-2కే23

ప్రజాశక్తి-గుంటూరు

విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయాలనే ఉద్దేశంతో భారీ ప్రణాళిక, వ్యయంతో తమ యూనివర్సిటీ జాతీయస్థాయి సజనాంకుర ఆవిష్కరణలను నేటి నుంచి రెండ్రోజులపాటు నిర్వహిస్తున్నట్లు విజ్ఞాన్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ పీ.నాగభూషణ్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రారంభ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా షిబ్‌పూర్‌లోని ఐఐఈఎస్‌టీ డైరక్టర్ ప్రొఫెసర్ పార్థసారథి చక్రబర్తి, కర్ణాటక- మైసూర్‌లోని ఎక్సెల్‌సాఫ్ట్ టెక్నాలజీస్ ఫౌండర్ అండ్ సీఈవో సుధన్వ ధనంజయ హాజరుకానున్నారని వెల్లడించారు. శనివారం ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వందేభారత్ ఎక్స్‌ప్రెస్ ఇన్నోవేటర్ సుధాన్షుమణి, న్యూఢిల్లీలోని బోట్‌ల్యాబ్ డైనమిక్స్ ఎండీ డాక్టర్ సరిత అహల్వాత్, నూకాన్ ఏరోస్పేస్ ఆపరేషన్స్ వైస్ ప్రెసిడెంట్ అరవింద్ కే సింగ్, ఏపీ ప్రభుత్వ ఐ అండ్ పీ అడ్వైజర్ రాజీవ్ వైఎస్సార్ హాజరవుతారని పేర్కొన్నారు. ఈ సృజనాంకురాలో అంతర్జాతీయస్థాయి నైపుణ్యం, నాణ్యతతో కూడిన వేలాది ప్రయోగ నమూనాలను ప్రదర్శించనున్నా రన్నారు. దేశ వ్యాప్తంగా 15వేల మందికి పైగా విద్యార్థులు ఇప్పటికే రిజిస్ట్రేషన్ చేసుకున్నారని, రూ.9 లక్షల విలువైన నగదు బహుమతులను అందిస్తున్నట్లు చెప్పారు.

యార్డు ఛైర్మన్ సుధాకర్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలిపిన డైరెక్టర్లు

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు మార్కెట్ యార్డు నూతన ఛైర్మన్ బాధ్యతలు స్వీకరించిన మద్దిరెడ్డి సుధాకర్‌రెడ్డిని యార్డు డైరెక్టర్లు గురువారం మర్యాదపూర్వకంగా కలిసి, పూలబొకే అందచేసి, శాలువాతో సన్మానించారు. అనంతరం వారు సమావేశమై యార్డులో మిర్చి అమ్మకాలు, గిట్టుబాటు ధర, రైతులకు కల్పించాల్సిన మౌలిక వసతులపై చర్చించారు.

క్రీడల్లో విజేతలకు బహుమతులు అందిస్తున్న లలిత్‌బాబు, చైర్మన్ విద్యాసాగర్

సంకల్పం ఉంటే ఎంతటి లక్ష్యాన్నైనా సాధించవచ్చు

ఇంటర్నేషనల్ చెస్ గ్రాండ్ మాస్టర్ లలిత్‌బాబు

ప్రజాశక్తి-తెనాలి: సంకల్పసిద్ధి, దానికి అనుబంధంగా కృషి, పట్టుదల ఉంటే ఎంతటి లక్ష్యాన్నైనా అదిగమించవచ్చునని చెస్ ఇంటర్నేషనల్ గ్రాండ్ మాస్టర్ ఎం.లలిత్‌బాబు అన్నారు. వాసిరెడ్డి వెంకటాద్రి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాల నంబూరులో నిర్వహించిన క్రీడా దినోత్సవంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. వివిఐటి చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ అద్యక్షతన జరిగిన కార్యక్రమంలో కళాశాల్లో నిర్వహించిన వివిధ క్రీడల్లో విజేతలకు తొలుత బహుమతి ప్రధానం చేశారు. అలాగే జెఎన్‌టియూ కాకినాడ స్పోర్ట్స్ టోర్నమెంట్ జట్లకు ఎంపికైన క్రీడాకారులను ఆయన అభినందించారు. ఈ సందర్భంగా లలిత్‌బాబు మాట్లాడుతూ తనకు ఆసక్తి ఉన్న చెస్‌పై పట్టు సాధించేందుకు అవిశ్రాంతంగా శ్రమించానన్నారు. క్రీడల్లో జయాపజాయలు ముఖ్యం కాదని, క్రీడాస్ఫూర్తిని ప్రదర్శిస్తూ ముందుకు సాగాలన్నారు. తన క్రీడా జీవితం ప్రారంభంలో వివిఐటి ప్రోత్సాహాన్ని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. తన తల్లి సహకారం కూడా తన ఎదుగుదలకు దోహదపడిందన్నారు. చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ మాట్లాడుతూ తెలుగు జాతి గర్వించదగ్గ క్రీడా తేజం లలిత్‌బాబన్నారు. భవిష్యత్‌లో దేశానికి గొప్ప విజయాన్ని సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ వై.మల్లిఖార్జురెడ్డి, అకడమిక్ డీన్ డాక్టర్ కె.గిరిబాబు, అడ్మిన్ డీన్ డాక్టర్ ఎన్.కుమారస్వామి, ఫిజికల్ డైరెక్టర్స్ డాక్టర్ ఎన్.అరుణ్‌కుమార్, డాక్టర్ ఎం.గిరిధర్, విద్యార్థులు పాల్గొన్నారు.

అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న కమిషనర్ కీర్తి చేకూరి

మీడియా డివైజ్ డిస్‌ప్లే ఫీజుల వసూళ్లకు ప్రత్యేక కార్యాచరణ

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు నగరంలో పెండింగ్‌లో ఉన్న మీడియా డివైజ్ డిస్‌ప్లే ఫీజుల వసూళ్ళపై స్పెషల్ డ్రైవ్ చేపట్టాలని, ఫీజులు చెల్లించని సంస్థల బోర్డ్ ల తొలగింపు చేపట్టాలని పట్టణ ప్రణాళిక అధికారులను నగర కమిషనర్ కీర్తి చేకూరి ఆదేశించారు. గురువారం కమిషనర్ క్యాంప్ కార్యాలయంలో పట్టణ ప్రణాళిక అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ మీడియా డివైజ్ బకాయిల వసూళ్ళలో పట్టణ ప్రణాళిక అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని, ఫీజులు చెల్లించని వారి బోర్డులు తొలగించడం, వసూళ్ళకు చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. బకాయిలను వార్డు సచివాలయాల వారీగా కేటాయించి, ప్లానింగ్ కార్యదర్శులకు, టిపిఎస్‌లకు లక్ష్యాలను నిర్దేశించి, ప్రతి రోజు సమీక్ష చేయాలని సిటీ ప్లానర్‌ని ఆదేశించారు. రోడ్డు విస్తరణ పనులు పూర్తి అయిన ప్రాంతాల్లో ఇంజినీరింగ్ అధికారులతో సమన్వయం చేసుకొని డ్రైన్ నిర్మాణ పనులు వేగంగా జరిగేలా చూడాలని ఆదేశించారు. రోడ్ల విస్తరణ జరుగుతున్న ప్రాంతాల్లో టి.డి.ఆర్. బాండ్లు ఇవ్వడానికి చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వ కార్యాలయాలు, పబ్లిక్ ప్రాంతాల్లో పోస్టర్లు అంటించినా, బ్యానర్లు కట్టినా పోలీసు కేసు నమోదు చేయడంతో పాటు, భారీ మొత్తంలో అపరాధ రుసుం విధించాలని పట్టణ ప్రణాళిక అధికారులను ఆదేశించారు. నూతన నిర్మాణాలు చేసే భవనాలకు దుమ్ము చుట్టుపక్కల పడకుండా గ్రీన్ పరదాలు ఏర్పాటు చేసుకునేలా చూడాలన్నారు. సమావేశంలో సిటి ప్లానర్ మూర్తి, డిప్యూటీ సిటి ప్లానర్ కోటయ్య, ఏ.సి.పి.లు కాలేష, బాబురావు, అజయ్ కుమార్, అశోక్ కుమార్, అజయ్ కుమార్, టి.పి.ఎస్.లు, సర్వేయర్లు పాల్గొన్నారు.

ఎపిఆర్‌జెసి భవనానికి స్థలాన్ని పరిశీలించిన జెసి

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు తూర్పు నియోజకవర్గంలోని ఎపిఆర్‌జెసి ఉర్దూ బాలుర కళాశాల, హాస్టల్‌కు సొంత భవనానికి జిల్లా సంయుక్త కలెక్టర్ జి.రాజకుమారి, గుంటూరు ఆర్‌డిఒ ప్రభాకర్‌రెడ్డి తదితరులు గురువారం స్థలాన్ని పరిశీలించారు. పాత గుంటూరులో ప్రైవేటు బిల్డింగ్‌లో నిర్వహిస్తున్న ఏపీఆర్‌జేసీ ఉర్దూ బాలుర కళాశాలకు, హాస్టల్‌కు సొంత భవనం నిర్మించుకోవటానికి స్థలం కేటాయించాలని గుంటూరు తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే షేక్. మహమ్మద్ ముస్తఫా ఇటీవల జిల్లా యంత్రాంగాన్ని కోరారు. ఈ క్రమంలో అధికారులు కళాశాలకు, హాస్టల్‌కు కేటాయించిన స్థలాన్ని పరిశీలించారు.ఈ సందర్భంగా ఆర్‌డిఒ, ఏపీఆర్‌జేసీకి 2003లోనే స్థలం కేటాయించటం జరిగిందని, బిల్డింగ్ నిర్మాణానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపడం జరిగిందని జెసికి వివరించారు.

అధికారులతో కలిసి స్థలాన్ని పరిశీలించిన జెసి జి రాజకుమారి